
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024



పుట్టిన రోజు, పెళ్లి రోజు, స్నేహితుల కలయిక ఇలా సందర్భం ఏదైనా బిర్యానీ పార్టీ మాత్రం ఉండాల్సిందే. ఏదో ఒక రెస్టారెంట్, హోటల్‌కు అందరూ వెళ్లాల్సిందే అన్నట్లుగా నేడు నగర వాసుల జీవన విధానం మారిపోయింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు నిర్వాహకులు కస్టమర్లను ఆకట్టుకునేందుకు యథేచ్ఛగా చైనా సాల్ట్ (మోనో సోడియం గూటామేట్)ను వినియోగిస్తున్నారు. దీనే వాడుక భాషలో అజినో మోటో అంటారు. ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయనాలతో తయారు చేసిన రంగులు కలిపేస్తున్నారు. ఇవి రెండు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నాడీ వ్యవస్థ దెబ్బతిని నరాల బలహీనత, బీపీ పెరిగి గుండెపై ప్రభావం చూపుతాయని హెచ్చరిస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ నిబంధనలకు విరుద్ధంగా తయారు చేసే ఆహారం భుజించేటప్పుడు అప్రమత్తత ఎంతైనా అవసరం.

బిర్యానీ భద్రమేనా!

యథేచ్ఛగా చైనా సాల్ట్, రంగుల వినియోగం

- నాణ్యతాప్రమాణాలకు తిలోదకాలు
- బరితెగిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు
- ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్న బయటి ఆహారం

నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం



హోటళ్లు, రెస్టారెంట్లలో రుచి కోసం వినియోగిస్తున్న టేస్టింగ్ సాల్ట్ ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ప్రధానంగా నాడీవ్యవస్థ దెబ్బతిని నరాల బలహీనత వస్తుంది. బీపీ పెరిగి గుండె సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతాయి.

- డాక్టర్ సరిత, డయాబెటిక్ వైద్యురాలు

దివిలో పోస్టింగ్‌కు పైరవీలు

జలవనరుల శాఖలో ఇన్‌చార్జి డీఈ పోస్టుపై కన్ను



ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న ఆర్సీ సెక్షన్ అధికారి

వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహారాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) జలవనరుల శాఖలో ఇన్‌చార్జి పోస్టులకు డిమాండ్ పెరుగుతోంది. ఇప్పట్లో పదోన్నతులు కల్పించే అవకాశం లేకపోవడంతో ఇన్‌చార్జి పోస్టులను దక్కించుకోవడానికి అధికారులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖలో కీలక పోస్టుల్లో అసలు అధికారుల కంటే ఇన్‌చార్జి అధికారులే ఎక్కువగా కనిపిస్తున్నారు. తమకు పదోన్నతులు కల్పించి ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయాలని ఇంజనీర్లు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గడచిన ప్రభుత్వం అర్హులకు పదోన్నతులు ఇవ్వకుండా తమకు అనుకూలంగా ఉన్న వారిని కీలక స్థానాల్లో నియమించి అడ్డగోలు వ్యవహారాలు చేయించింది. ఇటీవల జరిగిన బదిలీల్లో కొంతమంది స్థానాలు కదిలాయి. తాజాగా కొన్ని డివిజన్లకు ఖాళీగా ఉన్న ఈఈ స్థానాల్లో ఇన్‌చార్జిలుగా డీఈలను నియమించారు. ఇదే అదునుగా భావించిన ఓ అసిస్టెంట్ ఇంజినీర్ ఇప్పుడు డీఈ పోస్టులో ఇన్‌చార్జిగా కూర్చోవడానికి తహతహలాడుతున్నారు. ఇందుకోసం అన్ని విధాల పైరవీలు సాగిస్తున్నారు. వైసీపీ హయాంలో అవనిగడ్డ డివిజన్‌లో పనిచేసిన ఆ ఏఈ అప్పటి ప్రజాప్రతినిధులకు ముఖ్యఅనుచరుడిగా వ్యవహరించారు. వాళ్లు చెప్పిన పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. మోపిదేవిలోని ఆర్సీ సెక్షన్‌లో పనిచేస్తున్న దివి సబ్‌డివిజన్‌లోని ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈ పోస్టులో కూర్చోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ డివిజన్ కింద నాలుగు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌కు ఒక్కో ఏఈ ఉంటారు. ప్రస్తుతం ఏఈగా ఉన్న ఆయన డీఈ కుర్చీలో కూర్చుంటే మరింత బల పడవచ్చని భావిస్తున్నారు.

బినామీతో వరద పనులు!

నిబంధన ప్రకారం జలవనరుల శాఖలో పదోన్నతులు అయినా, ఇన్‌చార్జిలు అయినా 3:1 నిష్పత్తిలో ఇవ్వాలి. అంటే ముగ్గురు డీఈలకు, ఒక ఏఈకి ప్రయారిటీ ఇవ్వాలి. దీనికోసం విద్యార్హతల ఆధారంగా ఒక జాబితాను రూపొందిస్తారు. ఈ జాబితాలో పేరు లేకుండానే ఆ ఏఈ ఇన్‌చార్జి డీఈ కోసం ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఇందుకోసం కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంతకుముందు ఈయన హెడ్‌వర్క్స్ ఏఈగా పనిచేసేవారు. ఇక్కడ పనిచేస్తూనే చల్లపల్లి స్పెషల్ సబ్ డివిజన్ డ్రెయినేజీ ఇన్‌చార్జి డీఈగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ డివిజన్‌కు కొత్తగా బాబునాయక్ వచ్చారు. దీనితో ఈ డివిజన్‌ను వదిలేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఆర్సీ సెక్షన్‌కు వెళ్లారు. ఈ ఏఈపై అనేక ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బినామీ పేర్లతో పనులు చేయించారన్నది ప్రధాన ఆరోపణ. అప్పటి ఎమ్మెల్యే చెప్పిన వారికే వర్క్ఆర్డర్లు ఇచ్చినట్టు సమాచారం. ఇటీవల వచ్చిన వరదలకు దెబ్బతిన్న కట్టలను పటిష్టం చేసే పనులు జరుగుతున్నాయి. వాటిని ఆయన బినామీ పేర్లతో నామినేషన్ పద్ధతిన దక్కించుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పుడు ఈయన కన్ను దివి సబ్ డివిజన్‌పై పడింది. ఈ డివిజన్ కింద శ్రీకాకుళం, చల్లపల్లి, కోడూరు, హెడ్ వర్క్స్(పులిగడ్డ) సెక్షన్లు ఉన్నాయి. ఇన్‌చార్జి డీఈగా ఉంటే ఈ నాలుగు సెక్షన్ల కింద జరిగే పనుల ద్వారా భారీగా వెనుకేసుకోవచ్చన యోచనలో ఆ ఏఈ ఉన్నట్టు తెలిసింది. ఉన్నట్టుడి దివి సబ్‌డివిజన్ డీఈగా వెళ్లడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

మచిలీపట్నం మండల సమైక్యలో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు మండల సమైక్యను ఏటీఎంలా వాడుకుంటూ లక్షలాది రూపాయలను దారి మళ్లించారు. మూడేళ్లుగా ఆడిట్ జరగని డ్వాక్రా సంఘాల పేరుతో రూ.30 లక్షల వరకు రుణాలు మంజూరు చేయడం, మరికొన్ని నకిలీ డ్వాక్రా సంఘాల పేరుతో రుణాలు ఇచ్చేందుకు చెక్‌లు రాసి సిద్ధం చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఇటీవలనే ఏలూరు జిల్లా నుంచి మచిలీపట్నం మండలానికి బదిలీపై వచ్చిన ఏపీఎం మండల సమైక్యలో జరుగుతున్న అక్రమాలను చూసి, తాను ఇక్కడ ఉద్యోగం చేయలేనని, తనను వేరే మండలానికి బదిలీ చేయాలంటూ అధికారుల చుట్టూ తిరగడం చర్చనీయాంశమవుతోంది.



మండల సమైక్య నిధులు స్వాహా?

- రూ.2.01 కోట్ల డిపాజిట్ సొమ్ము నుంచి నకిలీ పేర్లతో స్త్రీ నిధి రుణాలు
- ఇప్పటికే రూ.30 లక్షలకుపైగా దారి మళ్లింపు
- వాటా ఇస్తే ఇబ్బంది లేకుండా చూస్తానని ఓ వ్యక్తి బేరాలు
- నేనిక్కడ ఉద్యోగం చేయలేనంటున్న కొత్త ఏపీఎం

మనుగడలో లేని డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలంలోని ఎస్ఎన్ గొల్లపాలెం, పోలాటితిప్ప, కానూరు, పెదపట్నం తదితర గ్రామాల్లో మనుగడలో లేని డ్వాక్రా సంఘాలున్నాయి. ఇవి ఆర్థికపరమైన లావాదేవీలు నిర్వహించకున్నా, బ్యాంకులలో ఖాతా నంబర్లు కొనసాగుతున్నాయి. ఈ తరహా డ్వాక్రా సంఘాల పేర్లను అడ్డుపెట్టుకుని బ్యాంకు అధికారుల సాయంతో సీసీలు, బుక్ కీపర్లు మండల సమైక్య పర్యవేక్షణలో పెద్దమొత్తంలో రుణాలు తీసుకుంటున్నారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో ఒక డ్వాక్రా గ్రూప్ మూడు సంవత్సరాలుగా పనిచేయకున్నా, ఇటీవల ఈ సంఘానికి రుణం మంజూరు చేస్తూ మండల సమైక్యలో తీర్మానం చేయడం వివాదాస్పదమైంది. మండల సమైక్యలో పనిచేస్తున్న సిబ్బంది ఈ అంశంపై ప్రశ్నించడంతో సదరు సిబ్బందిని ఒక సీసీ ఇక్కడి నుంచి మిమ్మల్ని బదిలీ చేయిస్తానని బెదిరింపులకు దిగినట్లు సమాచారం. మనుగడలో లేని డ్వాక్రా సంఘాలకు రూ.30లక్షల వరకు రుణాలు ఇవ్వాలని మండల సమాఖ్య చేసిన తీర్మానం కాపీలను, ఇక్కడ జరుగుతున్న అవకతవకలను డీఆర్‌డీఏ అధికారులకు సిబ్బంది తెలియజేసినట్లు తెలిసింది. నాడు ధాన్యం కమీషన్ వాడేసుకున్నా చర్యలు శూన్యం మచిలీపట్నం మండలంలో గతంలో డ్వాక్రా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన నిమిత్తం వచ్చిన లక్షలాది రూపాయల కమీషన్‌ను వాడేసుకోవడంలో ఎస్ఎన్ గొల్లపాలెం పరిధిలో పనిచేసే ఒకసీసీ కీలకంగా వ్యవహరించారు. ఈ వ్యవహారంపై గతంలో విచారణ చేసినా, రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో పక్కనపెట్టేశారు. మండల సమైక్యలో కీలకంగా వ్యవహరించే ఈ సీసీ మండల సమైక్య ఖాతాలో ఉన్న రూ.2.01 కోట్ల మేర ఉన్న నిధులను పక్కదారి పట్టిస్తారనే అనుమానంతో అప్పటి అధికారులు డీఆర్‌డీఏ అధికారుల ఖాతాలకు మళ్లించి, డిపాజిట్‌ల రూపంలో వివిధ బ్యాంకులలో వేశారు. ఈ డిపాజిట్‌లపై నెలకు రూ.39,200 వరకు వడ్డీ రూపంలో నగదు సమకూరుతోంది. సమైక్య సంఘంలోని నిధులను శ్రీనిధి ద్వారా డ్వాక్రా సంఘాలలోని సభ్యులకు తక్కువ వడ్డీకి ఒక్కొక్కరికి రూ.50వేల వరకు రుణాలుగా ఇవ్వవచ్చు. మండల సమైక్యలో కీలకంగా వ్యవహరిస్తూ సమైక్యను తమ గుప్పిట్లో పెట్టుకున్న ఒకరిద్దరు సీసీలు, బుక్‌కీపర్లు ఈ నగదును సైతం గుట్టుచప్పుడు కాకుండా నకిలీ పేర్లతో శ్రీనిధి రుణాలుగా మంజూరు చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారం రోజుల క్రితం రూ.5లక్షల వరకు ఇందుకు సంబంధించిన చెక్కులను రాసి సిద్ధం చేసినట్లు సమాచారం.

పెద్దలతో మాట్లాడి అన్నీ సరిచేస్తానని బేరాలు

మచిలీపట్నం మండల సమాఖ్యలో జరిగిన అక్రమాలను ఎప్పటికప్పుడు కనిపెడుతున్న ఎస్ఎన్ గొల్లపాలెంకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వంలో తనకు తెలిసిన పెద్దలున్నారని, వారివద్ద తనమాట చెల్లుబాటు అవుతుందని, తన వాటాగా కొంత సొమ్మును ఇస్తే అన్నీ వ్యవహారాలు సరిచేస్తానని బేరాలకు దిగినట్లు తెలిసింది. మండల సమైక్య కేంద్రం వద్దనే తిష్టవేసి అక్కడి సిబ్బందిని తనదైన శైలిలో బెదిరించడం చర్చనీయాంశంగా మారింది.

రికవరీ లేకుండానే పక్కన పెట్టేశారు..

ఏడాది క్రితం మచిలీపట్నం మండలం పోలాటితిప్ప గ్రామంలో కోటి రూపాయల వరకు డ్వాక్రా సంఘాల సభ్యులకు తెలియకుండానే బుక్‌కీపర్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంది. కొందరు డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను చెల్లించాలని బుక్‌కీపర్‌కు నగదును ఇస్తే బ్యాంకులో జమ చేయకుండా వాడేసుకుంది, బ్యాంకుల నుంచి డ్వాక్రా మహిళలకు తాకీదులు రావడంతో 30 గ్రూపులకు చెందిన మహిళలంతా తిరగబడి కులకట్టుబాటుపేరుతో అప్పట్లో సమావేశం నిర్వహించారు. ఏడాదిలోగా ఈ డబ్బు మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పినా, అనుకున్న సమయానికి నగదును ఈ బుక్‌కీపర్ చెల్లించలేదు. దీంతో గ్రామ పెద్దలు నగదు చెల్లింపు విషయంపై ప్రశ్నిస్తే వారిపైనే ఆమె ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో గ్రామస్తులంతా ఏకమై డీఆర్‌డీఏ అధికారుల సమక్షంలో ఆమెకు సంబంధించిన ఆస్తులను గ్రామపెద్దల స్వాధీనంలోకి తెచ్చుకున్నట్లు ప్రకటించారు. నగదు చెల్లించిన వెంటనే ఆస్తులను ఇచ్చేస్తామనే షరతులు పెట్టారు. కానూరు సమైక్య సంఘంలో రెండు నెలల క్రితం రూ.45లక్షల వరకు నిధుల గోల్‌మాల్ జరిగింది. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో ఈ అంశం ఏటూ తేలకుండా మరుగున పెట్టారు.

బెంగళూరు, చెన్నైలకు దీటుగా..

» గన్నవరం విమానాశ్రయ కారిడార్ సుందరీకరణ పనులు ప్రారంభించిన యార్లగడ్డ

6

ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై వేటు

6

» 'ల్యాండ్ కన్వర్షన్ మాయ' కథనంపై స్పందించిన కలెక్టర్

ముందు కొరియర్.. తర్వాత రవాణాదారుడు

8





ఆర్టీసీ అవస్థలు

- ఉన్న బస్సులపై విపరీతమైన భారం
- అవి కూడా కాలం తీరినవి, స్క్రాప్‌కు సిద్ధంగా ఉన్నవే..
- మెట్రో బస్సులకే ప్రయాణికుల ఆదరణ
- మహిళల ఉచిత ప్రయాణ పథకంతో మరింత ప్రభావం
- సామర్థ్యం పెంచకపోయినా.. కొత్తవి కొనకపోయినా ఇబ్బందులే!

విజయవాడ సిటీ పరిధిలో ఒక్కసారిగా తగ్గిన 100 బస్సులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయవాడ సిటీ బస్సుల పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. అమరావతి రాజధాని ప్రాంతంలో అతిపెద్ద నగరంగా ఉన్న విజయవాడలో 14 లక్షల మంది జనాభా నివసిస్తోంది. ఆర్టీసీ సబర్బన్ లిమిట్ విజయవాడ నగరాన్ని దాటి ఇబ్రహీంపట్నం, మైలవరం, నున్న, నూజివీడు, గన్నవరం, హనుమాన్‌జంక్షన్, ఉయ్యూరు, కంకిపాడు, అమరావతి, మంగళగిరిల వరకు ఉంది. అంటే దాదాపుగా ఆర్టీసీ సిటీ సబర్బన్ పరిధి విజయవాడ నగరాన్ని దాటి మరీ పరిధి విస్తరించి ఉంది. ఆర్టీసీ సబర్బన్ పరిధిలో 20 లక్షల మంది జనాభా రవాణా అవసరాలను తీర్చాల్సింది ఈ సిటీ బస్సులే. మరి ఇలాంటి పరిస్థితుల్లో సిటీ బస్సుల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం తక్షణం ఉంది. సిటీ బస్సుల సామర్థ్యాన్ని పెంచకపోతే రానున్న రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేయడంలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే జనాభాకు అనుగుణంగా బస్సులు తగిన సంఖ్యలో లేవు. ఉన్న బస్సులు కూడా కండీషన్‌లో లేవు. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించే క్రమంలో విజయవాడ సబర్బన్ పరిధిలో సిటీ బస్సులతో తీవ్ర సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఉచిత బస్సు పథకం కాబట్టి మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఎక్కే అవకాశం ఉంది. ఈ కారణంగా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్న సిటీ బస్సులతో తంటా తప్పేట్టు కనిపించటం లేదు. ఇలా కండీషన్ లేని, కాలం తీరిన డొక్కు బస్సులతో అధిక రద్దీ కారణంగా మరింత మొరాయించే అవకాశాలు ఉన్నాయి. ఏదైనా అపశ్రుతి దొర్లితే తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సిటీ బస్సులను సాధ్యమైనంత త్వరగా బలోపేతం చేసుకోవాలి. ఈ దిశగా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉంది.

విజయవాడ సిటీ ఆపరేషన్స్ ఇలా

విజయవాడ నగర సబర్బన్ పరిధిలో గవర్నర్‌పేట - 1, 2, ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం బస్ డిపోలు ఉన్నాయి. ఒక్కో డిపోకు సగటున 100 బస్సుల చొప్పున మొత్తం 400 ఉండేవి. ప్రస్తుతం ఈ డిపోల పరిధిలో మొత్తంగా 283 సిటీ బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. వీటిలో 108 బస్సులు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు కాగా, 175 సిటీ బస్సులు ఉన్నాయి. గవర్నర్ పేట - 1 బస్ డిపో పరిధిలో మొత్తం 60 బస్సులు ఉండగా.. వీటిలో 18 మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ బస్సులు 42 ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పరిధిలో 59 బస్సులు ఉండగా.. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 26, సిటీ బస్సులు 33 వరకు ఉన్నాయి. గవర్నర్‌పేట - 2 డిపో పరిధిలో మొత్తం 84 బస్సులు ఉండగా.. మెట్రోలు 52, సిటీ బస్సులు 33 ఉన్నాయి. విద్యాధరపురం డిపోలో మొత్తం 80 బస్సులు ఉండగా.. మెట్రో 12, సిటీ బస్సులు 68 ఉన్నాయి. సబర్బన్ పరిధిలో ఈ 283 బస్సులతోనే సర్వీసులను నడపాల్సి వస్తోంది.

మెట్రో బస్సులపై మితిమీరిన భారం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో కూడా ఉంటుంది. ఈ లెక్కన చూస్తే మిగతా 6లో..

దారుణంగా పడిపోయిన ఓఆర్

విజయవాడ నగరంలో తిరిగే సిటీ బస్సులలో ఓఆర్ దారుణంగా పడిపోయింది. సిటీ సబర్బన్‌లో మెట్రో బస్సులు కొంత వరకు బాగానే ఉన్నాయి. సిటీ బస్సుల ఆక్యుపెన్సీయే మరీ దారుణంగా ఉంది. నగర పరిధిలోని అన్ని సిటీ బస్సులలో (మెట్రో మినహా) 47 శాతం ఆక్యుపెన్సీ రేషియో మాత్రమే ఉంది. ఈ బస్సులు ఎక్కితే ఒళ్లు హూనమైపోతుండటంతో ప్రయాణికులు ఈ బస్సులు ఎక్కటం లేదు. దీని ఫలితమే ఓఆర్ పడిపోవటానికి నిదర్శనం. ఏ డిపోకు చెందిన సిటీ బస్సులు చూసినా.. ఓఆర్ దారుణంగా ఉంది. గవర్నర్ పేట- 1 45 శాతం, ఇబ్రహీంపట్నం 58 శాతం, గవర్నర్‌పేట-2 47 శాతం, విద్యాధరపురం 44 శాతం ఓఆర్ చొప్పున ఉంది.



అధ్వాన దారిలో.. అవస్థలెన్నో!

6లో

పోర్టు పనులు వేగవంతం చేయండి

కలెక్టర్ బాలాజీ

6లో

చెరకు రైతుకు కేసీపీ తీపి కబురు

టన్ను ధర రూ.3,576

చెరకు రైతుకు కేసీపీ తీపి కబురు

» టన్ను ధర రూ.3,576

ఉయ్యూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేసీపీ చక్కెర కర్మాగారం 2024-2025 సీజన్‌కు చెరకు ధర టన్నుకు రూ. 3,576గా ప్రకటించింది. కర్మాగార ఆవరణలో శుక్రవారం యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ అధ్యక్షతన చెరకు రైతుసంఘం నేతలతో జరిగిన సమావేశంలో చెరకు గానుగాడు ప్రస్తుత సీజన్‌కు ధర సబ్సిడీతో కలిసి రూ.3,576గా ప్రకటించారు. యాంత్రీకరణకు అనువుగా సాగుచేసిన రైతులకు టన్నుకు రూ.3,676 సబ్సిడీతో కలిపి చెల్లించనున్నట్టు సీతారామదాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరులో అకాల వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులకు సంఘం విన్నపం మేరకు రూ.40.89లక్షల ఆర్థికసహాయం ప్రకటించారు. రానున్న సీజన్‌కు ఈ సంవత్సరం నవంబరు నుంచి 2025 ఫిబ్రవరి వరకు నాటే చెరకు తోటలకు ఎకరానికి రూ.10,000 సబ్సిడీ ఇవ్వనున్నట్టు తెలిపారు. సబ్సిడీతో పాటు సంప్రదాయ పద్ధతుల్లో నాటిన తోటలకు టన్నుకు రూ.400 లేదా యాంత్రీకరణ అనువుగా వేసిన తోటలకు టన్నుకు రూ.500 సబ్సిడీగా ప్రకటించారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని విరివిగా చెరకు సాగుచేసి తోడ్పడాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై వేటు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'ల్యాండ్ కన్వర్షన్ మాయ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈనెల 17న ప్రచురితమైన కథనానికి కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ స్పందించారు. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ కృష్ణచైతన్యను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చల్లపల్లి మండలంలో ల్యాండ్ కన్వర్షన్‌కోసం వచ్చిన దరఖాస్తుల్లో నకిలీ చలానాలను సృష్టించి, ప్రభుత్వ ఆదాయాన్ని దారిమళ్లించిన ఘటనపై కృష్ణచైతన్య, అతడికి సహకరించిన ఆయన బంధువు బి.రామాంజనేయులుపై క్రిమినల్ కేసులు నమోదైనట్టు ఆయన తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ కృష్ణచైతన్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్‌కు నివేదికను సమర్పించినట్టు కలెక్టర్ తెలిపారు.


మంగినపూడి బీచ్‌లో దుకాణాల వద్దకు చేరిన నీరు

ముందుకు వచ్చిన సముద్రం!

యాత్రికులకు అనుమతి నిరాకరణ.. చిరు వ్యాపారాలు బంద్

మచిలీపట్నంటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మంగినపూడి బీచ్‌లో సముద్రం 50 అడుగుల మేర ముందుకు వచ్చింది. రెండు రోజులుగా.. కొబ్బరిచెట్లు దాటి సముద్రం చొచ్చుకు వచ్చింది. బీచ్‌లో తినుబండారాలు, కూల్‌డ్రింక్‌ల దుకాణాలను ముంచెత్తింది. వ్యాపారాలు మూలనపడ్డాయి. వాతావరణ శాఖ, మెరైన్, రూరల్ పోలీసుల హెచ్చరికలతో యాత్రికులు సముద్రస్నానానికి వెళ్లటం లేదు. బీచ్‌లోకి యాత్రికులను అనుమతించడం లేదని రూరల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. బీచ్ వద్ద ప్రత్యేక పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అక్కడ వ్యాపారాలు చేసే వారిని ఇళ్లకు వెళ్లిపోవాలని చెప్పామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో బీచ్ వద్ద నిషేధాజ్ఞలు విధించామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పోర్టు, గన్నవరం విమానాశ్రయం

పనులు వేగవంతం చేయండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టు, గన్నవరం విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం జేసీ గీతాంజలిశర్మతో కలిసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం పోర్టు, గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2025డిసెంబరు నాటికి పోర్టుపనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోర్టుకు సంబంధించి ఇప్పటివరకు 27శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. పోర్టు నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం జిల్లాలో ఒక రీచ్‌ను కేటాయించాలన్నారు. మచిలీపట్నం మెడికల్ కళాశాల పనులు, జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా చేసే అభివృద్ధి పనులకు మరొక రీచ్‌ను కేటాయించాలని సూచించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, నివేదిక అందించాలన్నారు. పోర్టు, విమానాశ్రయం కోసం భూసేకరణలో అసలైన భూమి యజమానులకే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయం విస్తరణలో నెలకొన్న భూ సమస్యలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, రైతులకు పరిహారం చెల్లింపు, కాలనీలకు అప్రోచ్‌రోడ్ల నిర్మాణం, కాలువలపై వంతెనల నిర్మాణం తదితర అంశాలపై అధికారులనుంచి వివరాలు సేకరించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, , పోర్టు నిర్మాణ సంస్థ మెఘా జీఎం తులసీదాస్, ఏపీ మేరీటైమ్‌బోర్డు డీఈఈ ఎం. శివయ్య, బందరు, గుడివాడ ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు.. విరివిగా రుణాలివ్వండి

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి అవకాశాలు అధికంగా ఉండే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక(ఎమ్మెస్ఎంఈ) రంగంతోపాటు, విద్య, గృహ నిర్మాణాలకు బ్యాంకులద్వారా విరివిగా రుణాలు అందజేయాలని కలెక్టర్ బాలాజీ బ్యాంకు అధికారులకు సూచించారు. బ్యాంకు అధికారులతో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో రుణాల రీషెడ్యూలుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని, ప్రభుత్వ ఆదేశాలను బ్యాంకు అధికారులు అమలు చేయాలన్నారు. రివర్స్‌మార్టిగేజ్ స్కీం అమలు కావడం లేదని సీనియర్ సిటిజన్ల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, బ్యాంకులు ఈ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. టిడ్కో గృహాలకు రూ.356కోట్లను రుణాలుగా అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.237కోట్లను అందించారని, మిగిలిన రుణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆక్వారైతులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, 80శాతం దరఖాస్తులు కేడీసీసీబీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బ్యాంకులు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, ఆర్‌బీఐ మేనేజర్ ఎంకే సుశీల్, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ తాతాజీ, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధ్వాన దారిలో..

అవస్థలెన్నో!


కోతకు గురైన రోడ్డు మార్జిన్, రోడ్డుపై గుంతలు (సర్కిల్)




వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళితో నిండిన రోడ్డు

ఇటీవల అవనిగడ్డ నుంచి కుటుంబ సమేతంగా హంసలదీవి వెళుతున్న కారు జయపురం వద్ద, రోడ్డుపై లేచిన కంకర రాళ్ల కారణంగా అదుపు తప్పి పంటకాలువలోకి దూసుకెళ్లింది.. 108 వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న మురుగు కాలువలోకి వెళ్లిపోయింది.. మాచవరం గ్రామసమీపంలో కోడూరు వస్తున్న కారు అదుపు తప్పి పంట కాలువలో బోల్తా పడింది.. విజయవాడ నుంచి విశ్వనాథపల్లికి శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు వి.కొత్తపాలెం గ్రామం వద్ద రోడ్డుపై ఉన్న కంకర రాళ్లపై జారి వెనుక వస్తున్న లారీ కిందపడి మృతి చెందాడు.. ఇదీ అధ్వాన రోడ్డు దుస్థితి..

- » గోతులమయంగా కోడూరు-అవనిగడ్డ రోడ్డు
- » దుమ్ము, ధూళితో వాహనదారులకు నరకం
- » రాళ్లు తేలిన రోడ్డుపై తీవ్ర ప్రమాదాలు
- » ప్రభుత్వం స్పందించాలని ప్రజల వినతి

(కోడూరు, ఆంధ్రజ్యోతి)

నిత్యం వందలసంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రహదారి నిర్మాణ దశలోనే నిలిచిపోవటంతో రోడ్డుపై లేచిన కంకర రాళ్ల కారణంగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రహదారి నిర్మాణం పూర్తిచేసిన తర్వాతే ప్రజలను ఓట్ల కోసం వస్తానని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో బహిరంగ సభలో రోడ్డు నిర్మాణానికి రూ.33 కోట్లు మంజూరు చేస్తున్నట్టు వాగ్దానం కూడా చేయించారు. కానీ వారి మాటలన్నీ నీటి మీద రాతలుగానే మిగిలాయి. రోడ్డు నిర్మాణానికి రూ.16.80 కోట్లు నిధులు మంజూరైనట్టు ప్రకటన చేసి ఎన్నికల నోటిఫికేషన్ ముందు హడావిడిగా శంకుస్థాపన చేశారు. ఆ సమయంలోనే రోడ్డు పనులు జరుగుతున్నట్టు పైపైన పనులు చేశారు. ఎన్నికల్లో వైసీపీ పరాభవంతో రోడ్డు నిర్మాణం అగమ్యగోచరంగా మారింది.

13కిలోమీటర్ల మేర ఉన్న అవనిగడ్డ-కోడూరు ప్రధాన రహదారిని 7.5 కిలోమీటర్ల మేర గ్రావెల్ తోలి చదును చేసి వదిలేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతో పక్కనే పంట కాలువలోకి రోడ్డు కుంగిపోతున్నది. రోడ్డుకిరువైపులా వేసిన బుసక వర్షానికే కారిపోతోంది. రోడ్డుపై ముందు వెళుతున్న వాహనాల తాకిడికి లేచిన దుమ్ములో ప్రయాణించాలంటే వాహనదారులకు, పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్డుపై గుంతలను గుర్తించలేక, కంకర రాళ్ల మధ్య వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర అవస్థలు పడుతున్నాం..

- తోట శ్రీరాములు, జరుగు కిరణ్‌కుమార్




కోడూరు రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉండటంతో అత్యవసర పరిస్థితిలో తప్ప ఇతర ప్రాంతాలకు వెళ్లలేకున్నాం. గత ఐదేళ్లుగా తీవ్ర అవస్థలు పడుతున్నాం. వెంటనే రహదారి నిర్మాణం పూర్తి చేయండి

గత వైసీపీ ప్రభుత్వం మాటలు చెప్పి కాలం గడిపింది. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించా. 100 రోజులైనా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాకపోవటం బాధాకరం.

ఇదే విషయమై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను వివరణ కోరగా, కోడూరు - అవనిగడ్డ రోడ్డు అధ్వానంగా ఉన్నమాట వాస్తవమేనని, సంబంధిత కాంట్రాక్టర్‌తో రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయిస్తానన్నారు. కొద్దిరోజుల్లో పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపినట్టు ఎమ్మెల్యే చెప్పారు.


రుద్రవరం గ్రామంలో శైలజ తల్లి ఉండే ఇల్లు

పెళ్లికి పెద్దలు నిరాకరించారని

- » పెదకాకానిలో ప్రేమ జంట ఆత్మహత్య
- » రుద్రవరం గ్రామంలో విషాదఛాయలు

నందిగామ రూరల్, అక్టోబరు 18 : పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని పెదకాకాని వద్ద రైలు పట్టాలపై ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. యువతి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన నండ్రు శైలజ (19) కాగా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. రుద్రవరం గ్రామానికి చెందిన నండ్రు వెంకయ్య అలియాస్ ఇజ్రాయిల్, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వెంకయ్య ఇటీవల మృతి చెందటంతో భార్య విజయ వ్యవసాయపనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. పెద్ద కుమార్తె ఝాన్సీరాణికి వివాహం కాగా రెండో కుమార్తె ఎస్తేరు రాణి మండలంలోని పల్లగిరి సమీపంలోని మరియనివాస్ కళాశాలలో టీటీసీ చదువుతుండగా మూడో కుమార్తె శైలజ హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండేది. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ నుంచి గుంటూరుకు వచ్చి ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నది. ఈ క్రమంలో ఈనెల 16న ఇంటికి వస్తున్నానని కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి తెలిపింది. సాయంత్రమైనా రాకపోవటంతో తల్లి విజయ నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సీఐ వైవీఎల్ నాయుడు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శుక్రవారం ఉదయం శైలజ తల్లికి ఫోన్ చేసి గుంటూరు జిల్లా పెద్దకాకాని రావాలని చెప్పింది. అనంతరం తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందన్న సమాచారం తెలిసి ఆ తల్లి గుండెలవిసేలా రోదిస్తుండటం చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరు, చెన్నైలకు దీటుగా..

గన్నవరం విమానాశ్రయ కారిడార్ సుందరీకరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరు, చెన్నై ఎయిర్‌పోర్టులకు దీటుగా గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ సుందరీకరణ పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కారిడార్ సుందరీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఫిలిం సిటీ తరహా ఆర్కిటెక్ నైపుణ్యాలు, అత్యద్భుత ల్యాండ్ స్కేపింగ్‌తో అబ్బుర పరిచేలా ఉంటుందన్నారు. శుక్రవారం గన్నవరం విమానాశ్రయం వద్ద జాతీయ రహదారి సుందరీకరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎంతోమంది విదేశీయులు, పారిశ్రామిక వేత్తలు ప్రముఖులు వస్తుంటారని, రోడ్డు మార్గంలో గ్రీనరీ సరిగా లేని పరిస్థితి నెలకొందన్నారు. విజయవాడ మార్గంలో ఫుట్‌పాత్ రెయిలింగ్‌లు పాడయ్యాయని చెప్పారు. కేసరపల్లి నుంచి విమానాశ్రయం వరకూ 15వేల చదరపు అడుగుల్లో గ్రీనరీ పనులు 15రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో విమానాశ్రయం నుంచి చిన అవుటపల్లి వరకూ సుందరీకరణ పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. బెంగళూరు, చెన్నై ఎయిర్‌పోర్టుకు దీటుగా ఇక్కడ కూడా తీర్చిదిద్దుతామని తెలిపారు. మల్లవల్లిలో 426 పరిశ్రమల స్థాపనకు భూములు కేటాయించారని, 18నెలల్లో పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు ఎదురుగా 15ఎకరాల ప్రభుత్వ భూమిలో 10 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్, 2.5 ఎకరాల్లో ప్రభుత్వ గెస్ట్ హౌస్ ఏర్పాటుచేయాలని సీఎం చంద్రబాబును కోరినట్టు తెలిపారు. ట్రిపుల్ ఐటీని గన్నవరం తీసుకువచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. బీజేపీ నేత చిగురుపాటి కుమారస్వామి, టీడీపీ నేతలు జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, గూడవల్లి నరసింహారావు, గుజ్జర్లపూడి బాబూరావు, గొట్టిపూళ్ల శ్రీనాథ్, మూల్పూరి సాయి కళ్యాణి, మేడేపల్లి రమాదేవి, నెక్కంటి శ్రీదేవి, గుమ్మడి వెంకట్రామయ్య, తుమ్మల లక్ష్మణరావు, నల్లూరి వెంకటరత్నం, యనమదల సతీష్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి, జీఎం దయాకర్ బాబు, సత్యన్నారాయణ, శ్రీధర్‌రెడ్డి, డీపీవో అరుణ, వెటర్నరీ కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, తహసీల్దారు శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ


కృష్ణానదిపాయలో పడవల ద్వారా గాలిస్తున్న మత్స్యకారులు, మూర్తి (ఇన్‌సెట్)

కృష్ణానది పాయలో యువకుడు గల్లంతు

తోట్లవల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిపాయలో శుక్రవారం శుక్రవారం ఉయ్యూరుకు చెందిన సెప్టిక్ ట్యాంకు వ్యాన్ డ్రైవర్ జగన్నాథం మూర్తి(39) గల్లంతయ్యాడు.. జగన్నాథం శ్రీను, సత్తిబాబు, మరియమ్మతో కలిసి తోట్లవల్లూరులో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌కు వచ్చారు. ట్యాంక్ క్లీనింగ్ అనంతరం జగన్నాథం మూర్తి, శ్రీను, సత్తిబాబు తోట్లవల్లూరులో మద్యం సేవించారు. తర్వాత నదీ పాయలో స్నానానికి వచ్చారు. జగన్నాథం శ్రీను, సత్తిబాబు స్నానం చేస్తుండగా వారి వెనుక స్నానానికి దిగన మూర్తి కొట్టుకుపోయాడు. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎస్ఐ అర్జునరాజు ఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. పడవలతో వలలు వేసి రెండు గంటల పాటు గాలించినా ఫలితం లేదు. ఎస్ఐ అర్జునరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ బాలబాలికల జిల్లా ఖో-ఖో జట్ల ఎంపిక రేపు

గుడివాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 20న జిల్లా జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడక ప్రసాద్, ఎంవీ సత్యప్రసాద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు నవంబరు, 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, క్రీడాకారులు ఎత్తు, బరువు కలిపి 250 పాయింట్లకు మించకూడదన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ 20వ తేదీ లోగా ఆధార్, వయస్సు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీ అవస్థలు

(5వ పేజీ తరువాయి)

కాస్త మంచిగా ఉన్న బస్సులు ఇవే కావటం వల్ల వీటికే డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఇప్పుడే ఇవి 80 శాతం ఆక్యుపెన్సీని కలిగి ఉన్నాయి. రేపటి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇవి నూరు శాతం ఆక్యుపెన్సీతో కిటకిటలాడిపోయే పరిస్థితి ఉంది. నగరంలోని సిటీ డిపోలను పరిశీలిస్తే గవర్నర్‌పేట - 1 డిపోలో మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 85 శాతం, ఇబ్రహీంపట్నంలో 79శాతం, గవర్నర్‌పేట - 2లో 78 శాతం, విద్యాధరపురంలో 76 శాతం ఉంది. దీంతో ఈ బస్సులపై తీవ్ర ఒత్తిడి నెలకొనే ప్రమాదం ఉంది. ఆర్టీసీ అధికారులు మెట్రోల మీద ఒత్తిడి తగ్గించటానికి సిటీ బస్సుల సామర్థ్యాన్ని పెంచటంతో పాటు, కొత్త బస్సులను మరో 100 వరకైనా సమకూర్చుకోవల్సిన అవసరం ఉంది.

సందిగ్ధంలో చైర్మన్ పదవి!

- » నందిగామ మున్సిపల్ పీఠంపై తొలగని ఉత్కంఠ
- » ఎన్నిక కోసం ఆశావహుల ఎదురుచూపు
- » పాలన చక్కదిద్దే పనిలో కూటమి ప్రభుత్వం

(నందిగామ, ఆంధ్రజ్యోతి)

నందిగామ మునిసిపల్ పీఠం కోసం ఆశావహుల ఆరాటం, పట్టణ ప్రజల ఉత్కంఠకు తెరపడే సూచనలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నందిగామ మునిసిపల్ పీఠంపై చర్చ సాగుతోంది. ఇరవై వార్డులు ఉన్న పట్టణంలో గత ఎన్నికల్లో వైసీపీ 13 స్థానాలు కైవశం చేసుకొని మునిసిపాలిటీని సాధించింది. ఈ ఎన్నికల్లో టీడీపీకి ఆరు, జనసేనకు ఒక స్థానం దక్కింది. ఛైర్‌పర్సన్‌గా ఉన్న మండవ వరలక్ష్మి, వైస్ ఛైర్మన్‌గా ఉన్న మాడుగుల నాగరత్నంల అకాల మృతితో వైస్ ఛైర్‌పర్సన్-2గా ఉన్న ఓర్సు లక్ష్మిని ఇన్‌చార్జి ఛైర్‌పర్సన్‌గా నాటి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈక్రమంలో సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల సమయంలో వైసీపీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య, 13వ వార్డు కౌన్సిలర్ గేద్ద శేషకుమారి, 16వ వార్డు కౌన్సిలర్ అచ్చి దివ్యలు టీడీపీలో చేరారు. సాధారణ ఎన్నికలలో కూటమి నేతలు తిరుగులేని మెజారిటీతో గెలుపొందడంతో పాటు ఫలితాలు వెలువడిన వారం రోజుల్లోనే వైసీపీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ తానూరి రాము, 17వ వార్డు కౌన్సిలర్ పాపట్ల సాంబయ్య, 9వ వార్డు కౌన్సిలర్ విశ్వనాథపల్లి కృపారావులు టీడీపీలో చేరారు. భాగస్వామ్య పక్షానికి చెందిన జనసేన కౌన్సిలర్‌తో కలిపి కూటమి బలం 11కు పెరిగింది. ఎమ్మెల్యే, ఎంపీలకు కూడా ఛైర్‌పర్సన్‌ను



ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఉండటంతో సునాయాసంగా ఛైర్మన్ పీఠం దక్కే అవకాశం ఏర్పడింది. అందివచ్చిన అవకాశం కోసం టీడీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు ఆరాటపడుతున్నారు. ఎవరికి వారు స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు ఎంపీ కేశినేని చిన్నిల వద్దకు మద్దతుదారులతో వెళ్లి ఛైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అంతటితో ఆగక మంత్రి నారా లోకేశ్ వద్ద లాబీయింగ్‌కు దిగినట్టు సమాచారం. పదవి ఆశిస్తున్న ఆనలుగురు తమకు అనుకూలంగా ఉండే ప్రవాసాంధ్రులను సైతం రంగంలోకి తెస్తూ లోకేశ్‌కు మెయిల్స్ పెట్టిస్తున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే సౌమ్య ఈ వ్యవహారంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాతే ఛైర్‌పర్సన్ అభ్యర్థిని ప్రకటిస్తానని ఆమె స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాలపై పట్టణ ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది

సాంకేతిక సమస్యలు..

ఛైర్మన్ పీఠం కోసం ఆశావహులు బలం చూస్తున్నారు తప్ప సాంకేతిక సమస్యను పరిగణలోకి తీసుకోవడం లేదు. పీఠం దక్కాలంటే.. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. దీనికి ముందుగా ఖాళీగా ఉన్న 7, 11 వార్డులకు ఎన్నికలు జరపాలి. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లకు కూడా ఛైర్మన్ ఎన్నికలో ఓటు వేసే అవకాశంతో పాటు పోటీ చేసే అవకాశం కూడా కల్పించాల్సి ఉంది. అలా చేయాలంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీల సమాచారం తీసుకొని అన్నింటికీ ఒకే పర్యాయం ఎన్నికలు జరపాల్సి ఉంది. దీనికి కనీసం మూడు నెలల సమయం పడుతుంది. అప్పటి వరకూ వేచి ఉండాల్సిందే. లేదా నాలుగేళ్లు పూర్తయిన తరువాత అవిశ్వాస తీర్మానం ద్వారా ఛైర్‌పర్సన్‌ను దింపేలా చేయాలంటే వచ్చే ఏడాది మార్చి 17 వరకూ వేచి ఉండాల్సిందే. డెలిగేషన్ హోదాలో ఉన్న ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం కౌన్సిలర్లుకు ఉండదు. కాబట్టి ఎన్నికల సంఘం ముందు ఖాళీగా ఉన్న 7, 11 వార్డులకు ఎన్నికలు జరిపి అనంతరం ఛైర్‌పర్సన్ ఎన్నిక జరపాల్సి ఉంది.

రాజకీయ కోణం..

రాష్ట్రంలో పలుచోట్ల కౌన్సిలర్, వార్డు సభ్యుల, సర్పంచ్ స్థానాలకు ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం కోరితే వీటికి ఎన్నికల సంఘం త్వరితగతిన ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం పాలనలో స్థిరపడే పనిలో ఉన్నందున.. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ అక్రమాల ద్వారా స్థానిక సంస్థలన్నీ కైవశం చేసుకుంది. ప్రస్తుత స్థానిక సంస్థల్లో ఎనభై శాతం వైసీపీ నేతలే పదవుల్లో ఉన్నారు. ఉప ఎన్నికకు బదులు స్థానిక సంస్థలకు ముందస్తు ఎన్నికలు జరిపి తమవారిని కూర్చోబెట్టాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. అదే నిజమైతే ప్రస్తుత ఆశావహులకు పదవి అందని ద్రాక్షగానే మిగలనుంది.




కానూరు సూపర్‌విజ్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త.. యనమలకుదురు రోడ్డులో..

పడకేసిన పారిశుధ్యం!

- తాడిగడప మునిసిపాలిటీ చెత్త సేకరణ వ్యాన్ డ్రైవర్ల సమ్మెతో పేరుకుపోయిన చెత్త
- వెదజల్లుతున్న దుర్గంధం.. విజృంభిస్తున్న దోమలు
- ప్రజా సమస్యలు పట్టని అధికారులు.. కాంట్రాక్టర్లు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

(పెనమలూరు -ఆంధ్రజ్యోతి)

తాడిగడప మునిసిపాలిటీ చెత్త సేకరణ వ్యాన్ డ్రైవర్ల సమ్మెతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. సమస్యపై అధికారులు దృష్టి సారించకపోవడంతో నానాటికి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని క్లస్టర్లు కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురులో చెత్త సేకరణ వ్యాన్ల డ్రైవర్లు తమ పెండింగ్ జీతాల కోసం గత ఆరు రోజులుగా చేస్తున్నారు. సమ్మె కారణంగా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో మునిసిపాలిటీలోని వీధులు కంపుకొడుతున్నాయి. మూడు నెలలుగా తమకు జీతాలు చెల్లించకపోవడంతో వ్యాను డ్రైవర్లు నిరవధిక సమ్మెకు పూనుకోవడంతో మునిసిపాలిటీలోని అన్ని వీధుల్లో స్థానికులు చెత్తచెదారాలనురోడ్లపై పడవేస్తున్నారు. కానూరు ప్రధాన వీధి, నవతా రోడ్డు, వినాయకనగర్‌లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చెత్త తరలించే వ్యాను డ్రైవర్లు తమ పెండింగ్ జీతాలను చెల్లించని పక్షంలో ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించిన నేపథ్యంలో సమస్య మరింత జఠిలంగా మారింది. సక్రమంగా జీతాలు చెల్లించని పక్షంలో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వ్యాన్ డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. కానూరు సూపర్‌విజ్‌రోడ్డు, సనత్‌నగర్ రోడ్డుమూల, పోరంకి ప్రధాన రోడ్డులోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి ఆయా ప్రాంతాలు మురికి కూపాలను తలపిస్తున్నాయి. చెత్త సేకరణ వ్యాన్ల స్థానంలో తాత్కాలికంగా చెత్త సేకరణకు ట్రాక్టర్లను నియమించి చెత్త సేకరణ చేపట్టినా సమస్యకు పరిష్కారం అంతంతమాత్రంగానే ఉందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. చెత్త సేకరణ వ్యాను డ్రైవర్ల సమస్యలు తరుచుగా వినిపిస్తున్నా...వారి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, కాంట్రాక్టర్ల ఉదాసీనత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టటంలో అధికారులు, కాంట్రాక్టర్లు విఫలమవుతున్నారు.

సమ్మె విరమించేలా చర్యలు చేపడతాం

క్లాప్ ఏజెన్సీ నుంచి వ్యాను డ్రైవర్ల జీతాలు చెల్లిస్తున్నాం. కాంట్రాక్టరుకు ప్రభుత్వ చెల్లింపుల్లో జాప్యం కారణంగా జీతాలు ఆలస్యం అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జీతాల చెల్లింపుల్లో ప్రతిష్టంభన నెలకొంది. సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది.

-మునిసిపల్ కమిషనర్ భవానీప్రసాద్



గన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నేతల ధర్నా

ప్రజలపై విద్యుత్ భారం సరికాదు

గన్నవరం, అక్టోబరు 18 : ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపటం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ట్రూఅప్ చార్జీల పేరిట రూ.23 వేల కోట్లు ప్రజలపై భారాలు మోపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి అధికారం లోకి రాగానే వేలకోట్లు పెంచుకుంటూ పోవటం దుర్మార్గమన్నారు. నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, సూరగాని సాంబశివరావు, బెజవాడ తాతబ్బాయి గుండెమెడ ఉదయ భాస్కరరావు, బడుగు మరియదాస్, ఆవుటపల్లి సాంబయ్య, కళ్లం రాంబాబు, వీర్రాజు, సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు అవార్డు



ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్

ప్రసాదంపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో కో ఎడ్ డే కమ్ బోర్డింగ్ పాఠశాలల విభాగంలో ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడకు ఆంధ్రప్రదేశ్‌లో మొదటి స్థానం, ఆల్ ఇండియాలో 17 ర్యాంకును సాధించిందని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ మంగళవారం తెలిపారు. ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ప్రతినిధుల నుంచి ఈ అవార్డును పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1500 పాయింట్లకు గానూ 1183 పాయింట్లను స్కోర్ చేసినట్లు వెల్లడించారు. ఈ అత్యుత్తమ విద్యా సంబంధ నైపుణ్యానికి పాఠశాల నిబద్ధతను ప్రతిబింబించడమే కాకుండా ఉత్తేజపరిచే అభ్యాస వాతావరణం ఉంటుందన్నారు. కఠినమైన పాఠ్యాంశాలు, అత్యాధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞుల ఉపాధ్యాయ బృంద అంకిత భావంతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఈ ఘనత సాధించిందన్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బాపులపాడు మండలంలో చురుగ్గా సాగుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జింకా నలగామరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు 10వేలు సభ్యత్వం పూర్తి చేసి లక్ష్యానికి దగ్గరలో ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 20 వ తేదీ వరకు సభ్యత్వం నమోదు కార్యక్రమం కొనసాగుతుం దని తెలిపారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీని మరింత బలపర్చడానికి యువత సభ్యత్వం స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తోట మురళీధర్, సింగవరుపు భాస్కర్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కంకిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోడి పందేల శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. స్థానిక గాయత్రి విహార్‌లో కోడి పందేలు వేస్తున్నట్టు అం దిన సమాచారం మేరకు ఎస్సై డి. సందీప్ సిబ్బందితో కలసి దాడి చేశారు. 20 మందిని అదుపులోకి తీసుకొని, రూ. 20 వేలు, నాలుగు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు.

చెరకు రైతుకు కేసీపీ సహకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : వరదలకు నష్టపోయిన చెరకు రైతును ఆదుకునేందుకు కేసీపీ యాజమాన్యం రూ.40.89లక్షల ఆర్థిక సాయం అందిస్తూ, రైతు అభివృద్ధికి తోడ్పాటు నందిస్తుందని కేసీపీ యూనిట్ హెడ్ సీతారాందాస్ తెలిపారు. ఎస్.ఎన్. పాలెంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన షుగర్ లోడింగ్ పాయింట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. టన్నుకు మద్దతు ధర రూ.3576తో పాటు యాంత్రీకరణకు దూరాన్ని బట్టి టన్నుకు రూ. 100 నుంచి రూ. 150 వరకూ అదనంగా చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, వేలేరు, రంగన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సామూహిక హారతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : సనాతన సంప్రదాయాల్లోని విజ్ఞానాన్ని, హిందూ ధర్మ విశిష్టతను ముఖ్యంగా యువతకు తెలియజెప్పేందుకు ఆలయాల్లో సామూహికహారతి లాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మండల సహ కన్వీనర్ దావులూరి శ్రీహరి, గ్రామ కన్వీనర్ కొలుసు బలరాం వేర్వేరు కార్యక్రమాల్లో తెలిపారు. రంగన్నగూడెం, కొయ్యూరు, దంటగుంట్ల, రేమల్లె తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సామూహిక హారతి నిర్వహించారు. ఆల యాలు శక్తి కేంద్రాలుగా సామూహికంగా ధార్మిక కార్యక్ర మాలు నిర్వహించడం వల్ల సమిష్టితత్వం అలవడుతుందని ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. రంగన్నగూడెం హారతిప్రముఖ్ రంగామణి పాల్గొన్నారు.



ఆలయంలో దీపాలంకరణ

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవం

ఉయ్యూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెదఓగిరాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృత్తుల్లో దీపారాధన చేసి అనంతరం ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దయెత్తున తరలివచ్చి పూజలో పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం రేపు

పెనమలూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఇంటర్నేషనల్ కో- ఆర్డినేటర్ మల్లినేని ఠాగూర్ ఆధ్వర్యంలో పెనమలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఠాగూర్ తెలిపారు. తానా ఫౌండేషన్ ఛైర్మన్ శశికాంత్ వల్లేపల్లి, అన్నే రమణ, కొల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఠాగూర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505



సీఎం నారా చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ వేణుగోపాలరెడ్డి

డాక్టర్ వేణుగోపాలరెడ్డికి సీఎం ప్రశంస

ఆటోనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వీజీఆర్ డయాబెటిస్ ఎడ్యుకేషనల్ అండ్ అవేర్‌నెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలకు గానూ ప్రశంసాపత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా సమాజానికి చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ తరుపున ప్రకృతిని రక్షించడానికి 50 వేల చెట్లను పంపిణీ చేసినట్లు వేణుగోపాలరెడ్డి తెలిపారు. వీజీఆర్ డయాబెటిస్ అట్లాస్ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేసినట్లు వెల్లడించారు.



ఉప్పలూరులో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంకిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఉప్పలూరు, వేల్పూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లో సుమారు కోటి రూపాయలతో చేపట్టిన పలు రహదారుల అభివృద్ధి పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియా, పీఆర్ ఏఈ రాఘవరావు, ఈవో వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, పడవల మధుసూదనరావు, మల్లేశ్వరరావు, అన్నే సత్యనారాయణ, లాం సురేష్, కలపాల రాజేష్, దొండపాటి శ్రీను, జనసేన పార్టీ నాయకులు లాం బోసు తదిరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ప్రొద్దుటూరు విద్యార్థులు



కంకిపాడు, 18 (ఆంధ్ర జ్యోతి) : కార్పొ రేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠ శాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం అరుణ కుమారి అన్నారు. శుక్రవారం హెచ్‌ఎం మాట్లాడుతూ, పటమట బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు అండర్ 17 వాలీబాల్ పోటీల్లో కూకట్‌పల్లి షైనశ్రీ, పోగోలు వాగ్దేవి, అండర్ 14 విభాగంలో జ్యోతి, పి. యోగశ్రీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఉయ్యూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు..



ఉయ్యూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ -17 బాలుర విభాగంలో ఆర్. ప్రజ్వల్, అండర్ -14 బాలుర విభాగంలో జి.జీవన్ కుమార్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె. జ్యోత్స్నదేవి తెలిపారు.

ఇంటివద్దనే ఎల్వీపీఈఐ నేత్ర సేవలు

పెనమలూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రోగుల ఇంటివద్ద సమగ్ర నేత్ర సంరక్షణను ప్రత్యక్షంగా అందించే ఉద్దేశంతో ఎల్వీపీఈఐ ఎట్ హోమ్ పేరుతో తాడిగడప నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సేవలు ప్రారంభించినట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రశాంత్ గర్గ్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ భాటియా మాట్లాడుతూ, కంటి సంబంధిత సమస్యలున్న వారు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సేవలను ఒక ఫోన్‌కాల్ ద్వారా షెడ్యూల్ చేసుకోవచ్చని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పెనమలూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కంకిపాడుకు చెందిన మసిముక్కు రమేష్‌కు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రెండు లక్షల విలువైన ఎల్వోసీ మంజూరైంది. చెక్కును శుక్రవారం టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ నేత దోనేపూడి రవికిరణ్‌లు పోరంకి టీడీపీ కార్యాలయంలో బాధితునికి అందించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇమాం పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్

రీ సర్వే సమస్యలపై గ్రామ సభలు



ఉంగుటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే సమస్యలపై వెల్దిపాడులో సర్పంచ్ లాం నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆర్ఐ బి.సూర్యకాంతి రీసర్వేలో తలెత్తిన సమస్యలు, భూరికార్డుల సవరణలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం భూసమస్యలపై రైతుల నుంచి నాలుగు వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

పటమట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగల మరమత్తుల కారణంగా ఈ నెల 19న ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అయ్యప్పనగర్, యనమలకుదురు లాక్ రోడ్డు, చౌదరీ పేట ఏరియా, పప్పుల మిల్లు సెంటర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సంస్థ ఈఈ పి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉంగుటూరు : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నందమూరు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నందమూరు, మధిరపాడు, ఇందుపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జి.బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో హనుమాన్ జంక్షన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు గుడివాడ డీఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాపులపాడు, పెరికీడు, ఎస్.ఎన్. పాలెం, ముందడుగు కాలనీ, సీతారాంపురంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

రైతునేస్తం పురస్కారాలు రేపు

ఉంగుటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతునేస్తం 20వ వార్షికోత్సవం సందర్భంగా ముప్పవరపు ఫౌండేషన్, రైతునేస్తంల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం సాయంత్రం ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో రైతునేస్తం పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రైతునేస్తం అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు, విశిష్ట అతిథిగా తెలంగాణ వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు. శనివారం ఉదయం ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ అకిరా కంటి ఆసుపత్రి సౌజన్యంతో ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెగా వైద్యశిబిరాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని చెప్పారు.

పాడిరైతు ఆర్థికాభివృద్ధికి హెరిటేజ్ ఫుడ్స్ సహకారం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమను పోత్సహిం చేందుకు హెరిటేజ్ ఫుడ్స్ ద్వారా కాల్షియం, మినరల్స్‌తో కూడిన పశువుల దాణాను సబ్సిడీపై అందిస్తున్నాని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో శ్రుదీప్‌కేశవన్ తెలిపారు. వీరవల్లి హెరిటేజ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పల్లెర్లమూడిలో పాడిరైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెరిటేజ్ ఫుడ్స్ పాలసేకరణ కేంద్రాన్ని నూతనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పి. నాగఅప్పారావు, జోనల్ మేనేజర్ వి.దివాకర్, ప్లాంట్ మేనేజర్ గణేష్‌బాబు, రామకృష్ణ, వెంకటేష్, నాగేశ్వరరావు పాటు పాడిరైతులు పాల్గొన్నారు.

కోర్టు నుంచి పారిపోయిన రవికుమార్‌పై కేసు నమోదు

వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయిగా ఉన్న మరుపిళ్ల రవికుమార్ తమ కస్టడీలో ఉండగా, మరో ఇద్దరితో కలిసి స్కూటీపై పారిపోయినట్టు భవానీపురం పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ దుబ్బాక రామారావు సూర్యారావుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిపురం కాలనీకి చెందిన మరుపిళ్ల రవికుమార్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టుకు తీసుకువెళ్లారు. అతడిని కానిస్టేబుల్ రామారావు వెంటపెట్టుకుని సెకండ్ ఎ ఎంఎం కోర్టు వద్ద హాజరుపరిచారు. జడ్జి సెలవులో ఉన్నందున మరో జడ్జి వద్దకు ముద్దాయిని తీసుకువెళ్లారు. ముద్దాయి తరఫున లాయర్ వచ్చి రీకాల్ చేస్తామన్నారు. దీంతో జడ్జి ఇరు వర్గాలు ఆలోచించుకుని రావాలని చెప్పారు. తరువాత కోర్టు గుమాస్తాతో కానిస్టేబుల్ మాట్లాడుతుండగా మరుపిళ్ల రవికుమార్ మరో ఇద్దరితో కలిసి స్కూటీపై పారిపోయారు.



మీరు తినే.. బిర్యానీ భద్రమేనా..?

- విజయవాడలో బరితెగిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు
- ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు నీళ్లు
- విచ్చలవిడిగా పసుపు రంగు, చైనా సాల్ట్ వినియోగం
- నరాల బలహీనత వచ్చే అవకాశం





అప్పటికప్పుడు వేడివేడిగా టేబుల్ మీదకు వస్తున్న డిష్ తాజాగా తయారు చేసిందేనా? ఇది కొంతమంది ఆహారప్రియులకు వస్తున్న సందేహం.. చికెన్, మటన్ బిర్యానీలు ఆర్డర్ ఇచ్చేశాం. ఈ రెండూ ఫ్రెష్షేనా? మరికొందరి ప్రశ్న.

ఈ రెండింటిలో వాస్తవం లేకపోలేదు. ఆహార పదార్థాలకు, వెరైటీ డిష్‌లకు కేరాఫ్ అడ్రస్ విజయవాడ. ఇక్కడ ఆహార భద్రత ప్రశ్నార్థకం. తోపుడుబండ్లపై విక్రయించే ఆహారం నుంచి హోటళ్లలో సరఫరా చేసే ఆహారం వరకు అన్నీ అనుమానాలు, సందేహాలే. తాజా ఆహారమని చెప్పి సర్వర్లు టేబుళ్లపైకి తెస్తున్న డిష్‌ల్లో తేడాలుంటున్నాయి. తాజాదనం లోపించి కల్తీతత్వం కనిపిస్తోంది. ఈ డిష్‌ల్లో ఆరోగ్యానికి హానిచేసే రసాయనాలు, రంగులు కలుపుతున్నట్టు తేలింది. - ఆంధ్రజ్యోతి - విజయవాడ

మోనో సోడియం గ్లూటోమేట్.. దీన్నే చైనా సాల్ట్ అని వ్యవహరిస్తారు. అజినోమోటో అంటే త్వరగా గుర్తిస్తారు. దీన్ని డిష్‌ల్లో రుచి కోసం విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నట్టు ఫుడ్‌సేఫ్టీ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా దీన్ని బిర్యానీల్లో ఎక్కువగా ఉపయోగిస్తున్నారని తేలింది. దీని వాడకం వెనుక పెద్ద వ్యవహారమే ఉంది. వాస్తవానికి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపని పదార్థాలను ఉపయోగించి బిర్యానిని రుచికరంగా తయారు చేయాలి. సాధారణంగా బిర్యానీలో మసాలా ఫ్లేవర్ ఉంటుంది. దీన్ని చైనా సాల్ట్ పెంచుతుంది. హోటళ్లకు వచ్చే ఆహారప్రియులను ఆకట్టుకోవడానికి దీన్ని బిర్యానీల్లో అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. అంతేగాకుండా పసుపు ఛాయ కోసం రంగులు ఉపయోగిస్తున్నారు. బిర్యానీ, చికెన్ కర్రీ, మటన్ కర్రీ, చేప ఫ్రై, చికెన్ మంచురియా, ఎగ్ మంచురియా, ఇవన్నీ నాన్ విజిటేరియన్ డిష్‌లు.

వంటనూనెలో అనేక వ్యత్యాసాలు

వారాంతంలో నగర వాసులు ఏదోక రెస్టారెంట్‌కు కుటుంబ సమేతంగా వెళ్లి పార్టీలు చేసుకుంటారు. ఏ సందర్భంలో వెళ్లినా నాన్‌వెజ్ డిష్‌లను ఆర్డర్ చేస్తున్నారు. వాటి తయారీలో ఉపయోగించే వంటనూనెలో అనేక వ్యత్యాసాలుంటున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నూనెలో పోలార్ కంటెంట్లు 25 శాతానికి మించి ఉంటున్నట్టు తేలింది. ఒక లీటరు నూనెను రెండు, మూడుసార్లు కంటే ఎక్కువగా మరిగించకూడదు. మించి మరిగిస్తే అందులో ఉండే టోటల్ పోలార్ కాంపొనెంట్స్ (టీపీసీ) ఫ్రీ రాడికల్స్‌గా మారుతోందని అధికారులు చెబుతున్నారు. అధికారులు టీపీసీ మీటర్‌తో పరిశీలించినప్పుడు నూనెలో 25శాతం మించి ఉండకూడదు. పలు హోటళ్లలో ఈ టీపీసీ 50 నుంచి 75 శాతం చూపించింది. ఈ నూనె అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి నూనెలతోనే క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు. కొన్నిచోట్ల నూనె బాగా మరగబెట్టిన అడుగునున్న మడ్డిని తీసి పారేసి అదే నూనెలో కొత్త నూనె కలుపుతున్నారు. ఫుడ్‌కోర్టుల నుంచి రెస్టారెంట్లు, హోటళ్ల వరకు ఇదే తంతు. ఆయా కిచెన్లలో ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం. మాంసాహారాల్లో స్పైసీ కోసం రంగులు విపరీతంగా పూస్తున్నారని అధికారులు గుర్తించారు.

ముందు కొరియర్... తర్వాత రవాణాదారుడు

- గంజాయి నిందితుల కేసులో కొత్త కోణం
- ఒకరి వద్ద పనిచేసిన వినేష్
- ట్రిప్‌కు రూ.25వేలు వసూలు
- తర్వాత రవాణాదారుడిగా రూపాంతరం
- బీహార్‌లో రూ.75వేలకు నాటు తుపాకీ కొనుగోలు

విజయవాడ/గుణదల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులకు గంజాయితో దొరికిన రమేష్ వినేష్‌కుమార్, మరిముత్తు కుమారన్ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. వారిని రామవరప్పాడు రింగ్ వద్ద పోలీసులు 148 కిలోల గంజాయితో పట్టుకుని నాటు తుపాకీ సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వివరాలను రూరల్ డీసీపీ మహేశ్వర రాజు, ఏసీపీ దామోదర్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కిషోర్‌తో కలిసి పటమట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వెల్లడించారు. తమిళనాడుకు చెందిన రమేశ్ వినేశ్ కుమార్ (38), మరిముత్తు కుమారన్ (39) స్నేహితులు. వినేష్‌కుమార్‌కు గంజాయి సరఫరాలో అనుభవముంది. చెన్నైకి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి పనిచేసేవాడు. శ్రీనివాస్ సమకూర్చిన కారులో తుని వెళ్లి గంజాయిని తెచ్చేవాడు. విశాఖ జిల్లా నర్సీపట్నానికి చెందిన దుర్గ అనే వ్యక్తి ఈ గంజాయిని తుని వరకు తీసుకెళ్లి వినేష్‌కు ఇచ్చేవాడు. దాన్ని కారులో సేఫ్‌గా చెన్నైకి తీసుకెళ్లి శ్రీనివాస్‌కు అప్పగించేవాడు. ఇలా చేసినందుకు వినేష్‌కు రూ.25వేలు ఇచ్చేవాడు. ఇలా రెండు మూడుసార్లు చేసిన వినేష్ తర్వాత సొంత తెలివితేటలతో సొంతంగా కారు కొనుక్కుని తానే రవాణా చేయడం మొదలుపెట్టాడు. తుని వద్ద దుర్గ నుంచి సరుకును కొనుగోలు చేసి చెన్నై తీసుకెళ్లి మరో పార్టీకి విక్రయించడం మొదలుపెట్టారు. శ్రీనివాస్‌ను పక్కన పెట్టేశాడు. ఇలా ఆరుసార్లు గంజాయిని తీసుకెళ్లాడు. ఎప్పుడూ పోలీసులకు చిక్కలేదు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు ఈ గ్యాంగ్‌ను పట్టుకున్నారు. వినేష్ తన వద్ద ఉన్న నాటు తుపాకీని బిహార్‌లో రూ.75వేలకు కొనుగోలు చేశాడు. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకునే సమయానికి తుపాకీలో 6 రౌండ్ల బుల్లెట్లు లోడై ఉన్నాయి. గ్రామాల్లోని పాత కక్షల నేపథ్యంలో తుపాకీ కొన్నానని చెబుతున్నా పోలీసులు నమ్మట్లేదు. ప్రయాణం మొత్తం జాతీయ రహదారిపైనే జరుగుతుండడంతో ఎవరైనా ఆపితే అటాక్ చేయడానికి ఉంచాడన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు.

విజయవాడలో సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయండి

- మంత్రి మనోహర్‌కు బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల వినతి



పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెళ్ల మనోహర్‌ను కలిసిన బెజవాడ బార్ న్యాయవాదులు

విజయవాడ లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఉన్న జిల్లా వినియోగదారుల ఫోరం-2లోని దాదాపు 300 కేసులను మచిలీపట్నంలోని జిల్లా కన్స్యూమర్ ఫోరానికి బదిలీ చేయడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా) మంత్రి నాదెండ్ల మనోహర్, ఫోరం చైర్మన్ డి.శ్రీనివాసరావును కలిసి విన్నవించారు. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విజయవాడలోనే ఒక సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేసి వారానికి రెండు రోజులు విజయవాడ పరిధిలోని బదిలీ చేయబడిన కేసులను నగరంలోనే విచారణ చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి, ఫోరం చైర్మన్‌కు విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి, ఫోరం చైర్మన్ త్వరలో కార్యాచరణ రూపొందించి తెలియజేస్తామని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్, బార్ మాజీ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, న్యాయవాది రమేష్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వంలో కార్మికుల దోపిడీ

- కర్నాటక హైకోర్టు న్యాయవాది బాలన్



సదస్సులో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేతలు

గవర్నర్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కార్మికులు దోపిడీకి గురౌతున్నారని ప్రముఖ కార్మిక నేత, కర్ణాటక హైకోర్టు న్యాయవాది బాలన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉభయ ఐఎఫ్‌టీయూ సంస్థలు శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించాయి. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నేతలు ఎం.వెంకటేశ్వర్లు, ఏసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో రెగ్యులర్ ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 15శాతం తగ్గితే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య 85 శాతానికి పెరిగిందన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను కాపాడుకోవడానికి, కార్పొరేట్లకు ప్రభుత్వ సొమ్ము దోచిపెట్టడానికే మోదీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. వీటిని లేబర్ కోడ్‌లు అనేకంటే డెకాయిట్ కోడ్స్ అనడం సముచితంగా ఉంటుందని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకు విధానాల ప్రయోగశాలగా మారుస్తోందన్నారు. మోటారు, హమాలీ వంటి అసంఘటిత వర్గాల సంక్షేమం కోసం బోర్డుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయించుకునేందుకు ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పొలారి, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి. భారతి ప్రసంగించారు. సదస్సులో పలు తీర్మానాలను ఆమోదించారు.

'ఉల్లాస్ అక్షరాస్యత'పై దృష్టిపెట్టండి

- ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా



మాట్లాడుతున్న డాక్టర్ నిధి మీనా

విజయవాడ లీగల్, అక్టోబరు 18: పదిహేనేళ్లకు పైబడిన వారిలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా మార్చడంతోపాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత పెంపొందించేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఆదేశించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉల్లాస్ అమలుపై నిధి మీనా పాఠశాల విద్య, వయోజన విద్య, డీఆర్‌డీఏ, గ్రామ-వార్డు సచివాలయాలు, ఐసీడీఎస్, సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉల్లాస్ అమలుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిసారించాయని, ఈ పథకం లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని సూచించారు. నిరక్ష్యరాస్యులైన స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలు, కుక్‌లు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్‌వాడీ సహాయకులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. ఇందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన, మండల స్థాయిలో ఎంపీడీవో ఛైర్మన్‌గా కమిటీలు పనిచేస్తాయన్నారు. ఇది మూడేళ్లపాటు జరుగుతుందని, తొలిదశలో జిల్లాలో 7వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. నవంబర్ నుంచి సాయంత్రం 2 గంటల పాటు తరగతుల నిర్వహించాలని సూచించారు. ఉల్లాస్ నోడల్ అధికారి జి.ప్రసాదరావు, ఏపీవో ఎం.సింగయ్య, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఆర్‌ఆర్‌వో ఎస్‌వీ మోహన్‌రావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు

- సీపీఎం రాష్ట్ర నేత సీహెచ్ బాబూరావు




భారతీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఆందోళనకు సిద్ధమవుతామని, చార్జీలు తగ్గించే వరకు ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.8114 కోట్ల ట్రూ అప్ చార్జీల భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. ఇందుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో రమేష్ ఆసుపత్రి సెంటర్‌లోని ఏపీసీడీసీఎల్ విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలను విపరీతంగా దోపిడీ చేసిందన్నారు. మమ్మల్ని అధికారంలోకి తెస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు విద్యుత్‌పై శ్వేతపత్రం ప్రకటించి గత ప్రభుత్వం ఎలా అవినీతికి పాల్పడ్డారో తెలిపాలన్నారు. 4 నెలలు గడవకుండానే టీడీపీ కూటమి ప్రభుత్వం అదే దారిలో నడుస్తుందన్నారు. ఇందులో భాగంగా రూ.8114 కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపబోతోందన్నారు. 2022-23లో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అదనంగా కట్టమంటున్నారన్నారు. ఇప్పటికే 1.03పైసలు రెండు రకాలుగా సర్దుబాటు చార్జీలు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇదే కాకుండా 2023-24 సంవత్సరానికి గాను కొత్తగా రూ.11వేల కోట్ల సర్దుబాటు పోటు రాబోతోందన్నారు. మొత్తంగా రూ.20వేల కోట్లను ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. చిత్తశుద్ధి ఉంటే టీడీపీ ప్రభుత్వం ఆ జీవోను నిలుపుదల చేసి దానిపై విచారణ చేసి డబ్బును రాబట్టాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, బోయ సత్యబాబు, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణ, పి.కృష్ణ, నేతలు చిన్నారావు, జి.క్రాంతి, టి.చంద్రశేఖర్, వై.సుబ్బారావు, కోరాడ రమణ, రవీంద్ర, మురహరి పాల్గొన్నారు.



ధ్యాన యజ్ఞంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

దుర్గగుడిలో అఖండ ధ్యాన యజ్ఞం

వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు 12 గంటలపాటు ధ్యాన యజ్ఞాన్ని నిర్విరామంగా నిర్వహించారు. ప్రతి నెలలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ధ్యాన యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ధ్యాన యజ్ఞం వల్ల కలిగే విస్తృత ప్రయోజనాలను ఈవో వివరించారు.



రైతులతో మాట్లాడుతున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్

కౌలు సమస్యలు పరిష్కరిస్తాం

- సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యప్రవీణ్ చంద్

కృష్ణలంక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో రైతులకు చెందాల్సిన కౌలు సమస్యలను ఇప్పటికే కొన్ని పరిష్కరించి వారి ఖాతాల్లో నగదు జమచేశామని మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్‌చంద్ హామీ ఇచ్చారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్‌డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు పాల్గొని తమ సమస్యలను ఆయనకు విన్నవించుకొన్నారు. అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై వచ్చిన సమస్యల్లో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.విశ్వేశ్వరనాయుడు, కె.స్వర్ణమేరీ, బి.సాయిశ్రీనివాస్ నాయక్, జి.బీ మారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రెయిన్ల సమస్య పరిష్కారానికి కమిటీ

- ఆర్‌యూబీ ప్రారంభోత్సవంలో ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమా



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మధురానగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నుంచి రైల్వే లైన్లు వెళుతున్న చోట్ల డ్రెయినేజీలు పొంగుతున్న సమస్యను పరిష్కరించడానికి రైల్వే శాఖ, వీఎంసీ నుంచి సంయుక్త కమిటీ వేస్తామని అందులో తాను ఎమ్మెల్యే బొండా ఉమా ఉంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. గత టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసుకుని ప్రస్తుత టీడీపీ హయాంలోనే పూర్తయిన దేవీనగర్, మధురానగర్ ఆర్‌యూబీని శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే బొండా ఉమ నియోజకవర్గంలో అనేక పనులకు శంకుస్థాపనలు చేసి పూర్తి చేశారని తరువాత వచ్చిన వైసీపీ ఒక్క ఇటుక వేసి ఒక్క అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. ఇటీవల రైల్వే అధికారులతో సమావేశనప్పుడు సెంట్రల్‌లో కొన్ని సమస్యలు రైల్వేతో ముడిపడి ఉన్నాయని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఒక స్థలానిక సంబంధించి రైల్వేకు వీఎంసీకి మధ్య సమస్య ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఉమ మాట్లాడుతూ తాను శంకుస్థాపన చేసి 60 శాతం పనులు పూర్తి చేసిన ఆర్‌యూబీలో మిగిలిన 40 శాతం పనులు ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేదంటే వారి అసమర్థత, అవినీతే కారణమన్నారు. మధురానగర్‌కు ప్రధాన సమస్యలు ఇక్కడి రైల్వే గేటు, పప్పులమిల్లు రైల్వే గేటు అన్నారు. ఇక్కడ డబుల్ లైన్ ఆర్‌యూబీ పూర్తిచేసి ట్రయల్ రన్ చేసి ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, జనసేన సెంట్రల్ సమన్వయ కర్త బొలిశెట్టి వంశీకృష్ణ, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, డివిజన్ ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, కార్పొరేటర్ వీరమాచనేని లలితా కిషోర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, డివిజన్ నేతలు అడపా కోటేశ్వరరావు, బర్మాశ్రీనివాస్, ఏవీ రాంబాబు, తుంగం జాన్సీ మసిముక్కు వాసు, కెంబూరి కృష్ణ పాల్గొన్నారు.

నేడు గుళ్లపల్లి జ్యోత్స్న సంస్మరణ సభ

విజయవాడ లీగల్, అక్టోబరు 18: ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి గుళ్లపల్లి జ్యోత్స్న రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈనెల 8న మృతిచెందిన విషయం విదితమే. ఆమె ప్రముఖ న్యాయవాది, ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి. ఆమె విద్యార్థి దశ నుంచి అభ్యుదయ భావాలతో పనిచేస్తూ, సారా వ్యతిరేక ఉద్యమం, మహిళల హక్కుల కోసం, విద్యార్థినుల సమస్యలపై సమానత్వం కోసం అనేక సంఘాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. ఆమెతో ఉన్న మధుర స్మృతులను, ఉద్యమ సహచర అనుభవాలను పంచుకోవడానికి శనివారం ఉదయం 11 గంటలకు ఆమె సంస్మరణ సభ మంగళగిరి డీజీపీ ఆఫీస్ సమీపంలో గల సీకే కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసినట్టు సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు.



అకాడమీలో బాణం సంధిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

ఓల్గా ఆర్చరీ అకాడమీకి.. శాప్ చైర్మన్

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహానాడు రోడ్డులోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీని శాప్ చైర్మన్ ఏ రవినాయుడు గురువారం సందర్శించి అక్కడ క్రీడాకారులతో మాట్లాడారు. అకాడమీలోని క్రీడాకారులంతా సత్తా చాటుతూ జాతీయ పోటీలకు సిద్ధంగా ఉండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అకాడమీకి కావాల్సిన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన్ను ఆర్చరీ అకాడమీ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ శాలువాతో సత్కరించారు.



క్రీడాకారులను శాప్ ఎండీకి పరిచయం చేస్తున్న తరుణ్ కాకాని

జాతీయస్థాయి రోయింగ్‌కు కుశాల్, లిఖిత్

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగే జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్రానికి చెందిన రోయింగ్ క్రీడాకారులు కుశాల్, లిఖిత్ అర్హత సాధించారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, కోచ్ కృష్ణమూర్తికి ఆర్థిక సహాయం అందించే ధ్రువీకరణ పత్రాలను అందించారు. కుశాల్, లిఖిత్‌ను శాప్ వీసీఎండీ పీఎస్ గిరిషాకు తరుణ్ పరిచయం చేయగా, వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఏపీలో వాటర్ స్పోర్ట్సు, రోయింగ్‌కు మద్దతిస్తామని గిరిషా హామీ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141,152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

21 నుంచి గ్రామసభలు

పామర్రు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల రీసర్వేలో లోటుపాట్లను సరిదిద్దడం కోసం మండల పరిధిలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 21నుంచి నవంబరు 14 వరకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జి.రవికాంత్ తెలిపారు. గ్రామసభలో ప్రజలు, రైతుల నుంచి వినతులను స్వీకరించి అధికారులు పరిశీలించి, సమస్యలు పరిష్కరిస్తారన్నారు. మండలంలోని భూ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీఆర్సీ అమలు చేయాలి

తోట్లవల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పీఆర్సీని అమలు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ లోన్లు సమస్యలను పరిష్కరించాలని మండల బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) అధ్యక్షుడు పి.రాజా రాయల్, ప్రధాన కార్యదర్శి సుమన్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

ఏ క్షణమైనా కూలొచ్చు!



పెనమకూరు ఏనుగులకోడు డ్రెయిన్ వంతెనపై కుంగిన అప్రోచ్ రోడ్డు కాంక్రీటు శ్లాబు

వర్షాలకు మట్టి కరిగి కిందికి జారిన శ్లాబు .. ఆరు గ్రామాల రాకపోకలకు ఇదే ఆధారం



పెనమకూరు ఏనుగులకోడు డ్రెయిన్‌పై వంతెన అప్రోచ్‌రోడ్డు కింద మట్టి కరిగిపోవడంతో కుంగిన కాంక్రీటు శ్లాబు



వర్షాల కారణంగా అప్రోచ్‌రోడ్డు శ్లాబు కింద కరిగిపోతున్న మట్టి



వంతెనకు తూర్పువైపు కుడి భాగంలో మట్టి జారకుండా కర్రలతో కట్టిన దడి

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు)

పెనమకూరు వద్ద ఏనుగులకోడు డ్రెయిన్‌పై వంతెన అప్రోచ్‌రోడ్డు కాంక్రీటు శ్లాబు కుంగింది. భారీ వర్షాలకు అప్రోచ్‌రోడ్డు కింద వేసిన మట్టి పెద్దఎత్తున కరిగిపోతోంది. దీంతో కాంక్రీటు శ్లాబు కూడా అడుగు మేర కిందికి జారింది. దీంతో ఆరు గ్రామాల ప్రజలు వంతెన అప్రోచ్‌రోడ్డు శ్లాబు ఏ క్షణమైనా కూలిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన అప్రోచ్ రోడ్డుకు నాలుగు వైపుల గల రిటైనింగ్‌వాల్స్ 20 ఏళ్ల క్రితమే విరిగి పడిపోయాయి. దాంతో రిటైనింగ్‌వాల్స్ విరిగిన ప్రదేశంలో గ్రామస్థులు తాటిబొత్తలను అడ్డుగా పెట్టారు. ఒకప్రక్కన సరుగు కర్రలు ఏర్పాటు చేశారు. ఇవేమి రక్షణ ఇవ్వలేకపోయాయి. ఏడాది క్రితం అప్రోచ్‌రోడ్డు అంచునుంచి ఎడ్లబండి జారిపడి ఎద్దులకు గాయాలయ్యాయి.

భయంభయంగా రాకపోకలు

తాజాగా కురిసిన వర్షాలకు కాంక్రీటు శ్లాబు కింద వేసిన మట్టి కరిగిపోయి కుంగటం ప్రారంభించింది. దానిపైనే ప్రజలు భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. పెనమకూరు చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు గ్రామాల ప్రజలు ఉయ్యూరు వెళ్లేందుకు ఈ వంతెనపైగా ప్రయాణం సాగిస్తుంటారు. అప్రోచ్‌రోడ్డు పూర్తిగా పడిపోతే రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఐలూరుకు ఆర్టీసీ బస్సు ఈ మార్గానే రాకపోకలు సాగిస్తుంది. ఆటోలు, చెరుకు సీజన్‌లో చెరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న వంతెన సమస్యపై దశాబ్దాలుగా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్లాబు పూర్తిగా పడిపోకముందే మరమ్మతులు చేయాలని, కొత్త వంతెన నిర్మాణానికి పాలకులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ చింతమనేని వెంకట శ్రీరామ్

ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లో అవకాశాలు పుష్కలం

గుడ్లవల్లేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషీన్ లెర్నింగ్‌లో నిపుణులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, మనిషి ప్రమేయం లేకుండా ఏఐ అండ్ డీఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో యంత్రాల ద్వారా అనేక రంగాల్లో పనులు నిర్వహించబోయే రోజులు అతి చేరువలో ఉన్నాయని ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) ఐఎస్ఈ ఆంధ్ర ప్రదేశ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ చింతమనేని వెంకట శ్రీరామ్ తెలిపారు. శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ)లో శుక్రవారం ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా), ఎస్ఆర్‌జీఈసీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాలు సంయుక్తంగా ఎంపవరింగ్ ఇంజనీర్స్ త్రూ అడ్వాన్స్ ఏఐ అండ్ డీఈఎస్ అను అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సదస్సును శుక్రవారం వెంకట శ్రీరామ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ ఎంఎల్‌సీ దేవీకుమార్, ప్రవీణ్ కుసుమ, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, యాజమాన్య సలహాదారు డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు, 54 కళాశాలల నుంచి 115 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

గుడివాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డీకే బాలాజీని శుక్రవారం గుడివాడ మున్సిపల్ నూతన కమిషనర్ బి.శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్కను అందజేశారు.



కలెక్టర్ బాలాజీకి మొక్క అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

గుడివాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలు రూ.8,114 కోట్లు ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడానికి ప్రయత్నిస్తున్నాయని రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎంపికైన క్రీడాకారులతో పీడీలు, పీఈటీలు

కబడ్డీ జిల్లా పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కూచిపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ జిల్లా పోటీలకు బాలబాలికల విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పూర్తయిందని మొవ్వ మండల ఫెడరేషన్ సమన్వయకర్త మోహన కృష్ణచందు తెలిపారు. పామర్రు మండలం నల్లగుంట గురుకుల పాఠశాల ఆవరణలో ఈ ఎంపిక పోటీలు జరిగాయని, కోసూరు జడ్పీ పాఠశాల నుంచి 11 మంది, మొవ్వ జడ్పీ పాఠశాల నుంచి పది మంది, పెడసనగల్లు జడ్పీ పాఠశాల నుంచి ఒకరు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఈ నెల 21న ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో, కృష్ణాజిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చందు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరావు

ఘనంగా ఫ్రెషర్స్‌డే

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీటెక్, ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. విద్యాపరంగా జూనియర్లకు సీనియర్లు సహాయ సహకారాలు అందించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు సూచించారు. ఇటీవల కళాశాల అటానమస్ హోదాను దక్కించుకుందని తెలిపారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇండస్ట్రియల్ టూర్లు, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తున్నామని అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డీన్స్, విభాగాధిపతులు, ప్లేస్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

భరణం చెల్లించని భర్తకు జైలు

గుడివాడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లి గ్రామానికి చెందిన కొనసం కిషోర్ తన భార్య జగన్నాథపు రమాదేవికి మెయింటెన్స్ చెల్లించనందుకు కోర్టు నెల రోజుల జైలు శిక్ష విధించిందని రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. భార్య భరణం కోసం కోర్టును ఆశ్రయించిందని, కిషోర్ గత ఏడాది నుంచి మెయింటెన్స్ డబ్బులు చెల్లించడం లేదని, కోర్టుకు హాజరు కావడం లేదని అతనికి గుడివాడ ఏజెఎఫ్‌సీఎం కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ ఇచ్చిందని తెలిపారు. శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి నెల రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



బల్లిపర్రులో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, తట్టివర్రులో భూమిపూజ చేస్తున్న కూటమి నాయకులు



జమీదింటకుర్రు, చాగంటిపాడులో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

నియోజకవర్గంలో 398 సీసీ రోడ్ల నిర్మాణం

● 'పల్లె పండుగ'లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రూ.24 కోట్లను మంజూరు చేశారని, వాటితో 398 సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలకు పల్లెపండుగ ద్వారాభూమిపూజలు చేస్తున్నామని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బల్లిపర్రులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించే నూతన సీసీ రోడ్లకు శుక్రవారం సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్‌తో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. సర్పంచ్ బొప్పన స్వర్ణలత, ఎంపీడీవో కె.జ్యోతి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సురేష్, పీఆర్ ఏఈ రామారావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గుడివాడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రహదారుల నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వం పని చేస్తోందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. రామన్నపూడి, తట్టివర్రు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామన్నపూడికి రూ.21 లక్షలు, తట్టివర్రుకు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళి, రామన్నపూడి సర్పంచ్ మీగడ మురళీధర్, తట్టివర్రు సర్పంచ్ నిర్మలా కుమారి, ఇంటూరి గజేంద్ర, లింగం ప్రసాద్, ఎంపీడీవో వై.వి.విష్ణుప్రసాద్, తహసీల్దార్ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.14.75 లక్షలతో చాగంటిపాడు చినకట్టకు సీసీ రోడ్డు

తోట్లవల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగంటిపాడు వాటర్ ట్యాంకు నుంచి కేఈబీ కెనాల్ చినకట్టపై పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రూ.14.75 లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, తెలుగుయువత మండల అధ్యక్షుడు కళ్లం వంశీ కృష్ణారెడ్డి, కళ్లం కోటిరెడ్డి, మట్టా అమృతబాబు, నాగేశ్వర్ నాయక్, విష్ణురెడ్డి తదితరులు భూమిపూజ నిర్వహించారు.

జమీదింటకుర్రు ఎస్సీ కాలనీలో..

పెదపారుపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జమీదింటకుర్రు ఎస్సీ కాలనీలో రూ.4 లక్షల నిధులతో కమ్యూనిటీ హాల్ వద్ద నుంచి 85 మీటర్ల మేర నిర్మించే సీసీ రోడ్డుకు టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి(చంటి) శంకుస్థాపన చేశారు. పాములపాడులో 90 మీటర్ల సీసీ రోడ్డుకు టీడీపీ నాయకుడు లెనిన్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, సర్పంచ్ పూనుకొల్లు శివరామప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, జాస్తి రామచంద్రరావు, నూతక్కి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపు తొలగించాలి

కూచిపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాల మధ్య మద్యం షాపు తొలగించాలని కూచిపూడి గ్రామస్థులు డిమాండ్ చేశారు. పెడసనగల్లు రహదారిలో నివాస గృహాల మధ్య నడుస్తున్న మద్యం షాపు వల్ల మహిళలు, చిన్నారులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. దుకాణాన్ని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్‌తోపాటు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని పి.రమేష్‌బాబు, బి.రవి బాబు, ఎం.సురేష్, నాగరాజు, బోరుకాటి రామరాజు తెలిపారు. నివాసగృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుపై మొవ్వలోనూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కరాటేలో గెలుచుకున్న పతకాలతో విద్యార్థులు

కరాటేలో డాక్టర్ కేకేఆర్స్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా మవాతిక షిటోరియో కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల్లో 14 ఏళ్లలోపు బాలుర వ్యక్తిగత కటా విభాగంలో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాల విద్యార్థులు బి.మంజునాథ్, బి.లక్ష్మీసాయిచరణ్, టి.నాగశాన్వి, బి.చాతుర్య, కె.దేవీప్రియ, జె.తీక్షిక, బి.జశ్వంత్, కె.వేదశ్రీలు పతకాలను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పతక గ్రహీతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

గుంతలున్నాయని బస్సులు రావట్లేదు

● వెంట్రప్రగడలో బస్టాండ్ వెలుపలి నుంచే వెళ్లిపోతున్న బస్సులు.. బస్టాండ్ లోపల ప్రయాణికుల ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి-పెదపారుపూడి): వెంట్ర ప్రగడలో బస్టాండ్ లోపలికి వెళ్లే రహదారిపై గుంతలు ఉండడంతో బస్సులు బస్టాండ్ ఆవరణలోకి వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు బస్సులు బస్టాండ్‌లోకి వస్తాయని వెళ్లి కూర్చుని ఎదురు చూస్తుంటే బస్సులు రోడ్డు మీద నుంచే వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే గుంతలు పూడ్చాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.



వెంట్రప్రగడ బస్టాండ్ రహదారిపై గుంతల్లో నిలిచిన నీరు

ఏఎన్ఆర్ కళాశాలలో ఎన్‌సీసీ రిక్రూట్మెంట్

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం 16వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సన్సార్ సింగ్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ రిక్రూట్మెంట్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ తెలిపారు. 21 మంది బాలురు, 12 బాలికలు ఎంపికయ్యారని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.505

స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేస్తే చట్టరీత్యా చర్యలు



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. మచిలీపట్నంలోని సాయిజస్విత మెటర్నటీ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు ఐఎంఏ గుర్తింపు కూడా రద్దు చేస్తామన్నారు. ఆరోగ్య విద్య బోధకుడు డి. రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంక ప్రధాన సెంటరులో ఓఎన్‌జీసీ నిర్మించిన మరుగుదొడ్ల పక్కన బ్రాంచి గ్రంథాలయం





నాగాయలంక ప్రధాన సెంటరులో ఆరోగ్య ఉపకేంద్రం పక్కన సామాజిక మరుగుదొడ్లు

పాఠకుల ఇబ్బందులు

గ్రంథాలయం చెంతనే ఓఎన్‌జీసీ మరుగుదొడ్లు

ఆంధ్రజ్యోతి - నాగాయలంక : నాగాయలంక ప్రధాన రహదారిలోని బ్రాంచి గ్రంథాలయం చెంతన లక్షలాది రూపాయలతో ఓఎన్‌జీసీ - వేదాంత సంయుక్త ఆధ్వర్యంలో ప్రజల అవసరాల కోసం నిర్మించిన నాలుగు మరుగుదొడ్ల నిర్వహణ లేక దుర్గంధం వెదజల్లుతున్నాయి. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు, దారిన వెళ్లే పాదచారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిందే. నాగాయలంకలోని మరుగుదొడ్ల నిర్వహణను ఓఎన్‌జీసీ, వేదాంత, గ్రామ పంచాయతీ పూర్తిగా విస్మరించాయి. మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను పంచాయతీకి ఇచ్చామని ఓఎన్‌జీసీ - వేదాంత చెపుతుండగా, తమకు ఇవ్వలేదని పంచాయతీ తప్పించుకోవడంతో ఐదేళ్ల కాలగర్భంలో గడిచిపోయాయి. ప్రజలకు ఎంతో అసౌకర్యం కల్పిస్తున్న ఓఎన్‌జీసీ నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ సమస్యను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జె.పవన్ కుమార్‌ను వివరణ కోరగా, ఓఎన్‌జీసీ- వేదాంత సంస్థ మరుగుదొడ్లను పంచాయతీకి అప్పగించలేదని, వాటిని వారే నిర్వహించాలని అన్నారు.

నాగాయలంకలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లోని మరుగుదొడ్లు ప్రజలకు నరకం చూపుతున్నాయి. గ్రంథాలయం పక్కనే ఓఎన్‌జీసీ నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పక్కనే పంచాయతీ ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నుంచి భరించలేని దుర్గంధం వస్తోంది. గ్రంథాలయానికి వెళ్లే పాఠకులు, ఆరోగ్య ఉపకేంద్రంలో పనిచేసే సిబ్బంది, వైద్యం నిమిత్తం వెళ్లే రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ రెండింటిలో పనిచేసే సిబ్బంది, వెళ్లే ప్రజలు అక్కడ ఉన్నంత సేపు ముక్కు మూసుకోవాల్సిందే.

రోగులకు నరకం

ఆరోగ్య ఉపకేంద్రం పక్కనే సామాజిక మరుగుదొడ్లు

ఆంధ్రజ్యోతి - నాగాయలంక : నాగాయలంక ప్రధాన సెంటర్‌లో తలశిల కుటుంబరాయుడు, రత్తమ్మల జ్ఞాపకార్థం వారి వారసులు పంచాయతీకి తమ పాత భవనంలోని రెండు గదులను వితరణ చేశారు. దానిలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సుదీర్ఘకాలంగా నిర్వహించారు. 17 సంవత్సరాల క్రితం రాజరాజేశ్వరి కాలనీలో ప్రభుత్వం నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆ భవనం నుంచి వైద్యాధికారులు, సిబ్బంది రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. ఖాళీ చేసిన పాత భవనంలోని ఒక గదిని పంచాయతీ స్వచ్ఛభారత్ నిర్వాహకులకు కేటాయించగా, మరో గదిని నాగాయలంక-2 ఆరోగ్య ఉప కేంద్రానికి ఇచ్చింది. 13 ఏళ్ల క్రిందట ఆరోగ్య ఉప కేంద్రం చెంతనే సామాజిక మరుగుదొడ్లను పంచాయతీ ఏర్పాటు చేసి నిర్వహిస్తోంది. పక్కనే మరుగుదొడ్లు ఉండడంతో వైద్యసేవలకోసం వచ్చే బాలింతలు, గర్భిణులు, రోగులు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకునిలోనికి వెళ్లాల్సిన దుస్థితి ఉందని వాపోయారు. వైద్యాధికారి వి.శివరామకృష్ణను వివరణ కోరగా, ఉప కేంద్రం-2 కు భవనం నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. పంచాయతీ మరుగుదొడ్ల నిర్వహనపై దృష్టి సారించాల్సి ఉందని ప్రజలు తెలిపారు.



జ్యుయలరీ పార్కులో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎదగాలి : కలెక్టర్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక సంస్థలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పోతేపల్లిలోని ఇమిటేషన్ జ్యూయలరీ పార్కులో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్, జిల్లా పరిశ్రమల శాఖ సహకారంతో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ ఎంటర్‌ప్రైన్యూర్స్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీకి ప్రత్యేకత ఉందని, సాంకేతికతను అందిపుచ్చుని ఉత్పత్తి రంగంలో ముందుకు సాగాలన్నారు. క్లస్టర్‌గా ఏర్పడి కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు సిడ్బీ రీజనల్ జనరల్ మేనేజరు వేమూరి చంద్రమౌళి మాట్లాడుతూ, మచిలీపట్నంలో సిడ్బీ శాఖను ప్రారంభిస్తామన్నారు. ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు అధ్యక్షుడు పి.వి. సుబ్బారావు మాట్లాడుతూ, క్లస్టర్ అభివృద్ధికి కలెక్టర్ చేస్తున్న సాయం ఎనలేనిదన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు ఆర్ వెంకట్రావు, బందరు డివిజన్ రైస్ మిల్లర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీ జ్యూయలరీ పార్కులో స్కిల్ హబ్‌ను సందర్శించారు.



మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి

ఆరోగ్య సంరక్షణపై మహిళలకు అవగాహన

పెడన రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, తల్లులు, గర్భిణులు, కిశోర బాలికల ఆరోగ్య సమస్యలను గుర్తించి, పరిష్కారం చూపటమే అంగన్వాడీ కేంద్రాల లక్ష్యమని బంటుమిల్లి సీడీపీవో సముద్రవేణి అన్నారు. ఆరోగ్య సంరక్షణపై తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి కరివేపాకు, మునగాకు ఎండగట్టి పొడిగా మార్చి కూరలలో వేసుకుంటే రక్తహీనత సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కేంద్ర నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విజయలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతులు, బదిలీల సమస్యలను పరిష్కరించాలంటూ మునిసిపల్ ఉపాధ్యాయులు శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బీ. కనకారావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు ధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లెనిన్‌బాబు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలపై జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. యూటీఎఫ్ ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్. ప్రభాకరరావు, ఎండి షౌకత్ హుస్సేన్, ఎం. వరప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం డీఈవో తాహెరా సుల్తానాకు సమస్యల మేరకు వినతిపత్రం సమర్పించారు.

వైద్య కళాశాలకు పింగళి పేరు ముదావహం



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మెడికల్ కాలేజికి జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య పేరు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావడం ముదావహమని నేతాజీ మిత్రమండలి ప్రతినిధులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. చిలకలపూడి పోలీసు స్టేషన్ వద్ద ఎంగళి వెంకయ్య విగ్రహానికి నేతాజీ మిత్రమండలి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెట్టేందుకు నిర్ణయించిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరిలకు కృతజ్ఞతలు తెలిపారు. పంతం వెంకట గజేంద్ర, కూనపరెడ్డి బ్రహ్మయ్య, సూరి హరికృష్ణ, విన్నకోట సుబ్బారావు, వేమూరి రామకృష్ణారావు, ఫణికుమార్, పిఎస్ఎస్ఆర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



హరిపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న గోపు



ఇంతేరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కాగిత

పల్లె పండుగలో రహదారులకు శంకుస్థాపన

కోడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ - పంచాయతీల వారోత్సవాల్లో భాగంగా మండలంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. లింగారెడ్డిపాలెంలో రూ.52.90 లక్షలతో ఎనిమిది సీసీ రోడ్లు, హరిపురంలో రూ.61.40 లక్షలతో 11 సీసీ రోడ్లు, కోడూరులో 55 లక్షలతో ఆరు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, గుడివాక శేషుబాబు, మర్రే గంగయ్య, బండే శ్రీనివాసరావు, డీఈఈ సురేష్ బాబు, సర్పంచ్‌లు యర్రంశెట్టి కనకదుర్గ, వెర్రి పావని, కనగాల వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు తిమ్మన వెంకట నాంచారయ్య, దాసరి వెంకటేశ్వరరావు, సనకా శైలజ, మాజీ సర్పంచ్ కడవకొల్లు నాంచారయ్య, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఏపీవో రవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బందరు మండలంలో

మచిలీపట్నం టౌన్ : నెలకుర్రు గొల్లపాలెం, తుమ్మలచెరువు, వాడపాలెం, కొత్తపల్లె తుమ్మలపాలెం గ్రామ పంచాయతీల్లో రోడ్ల నిర్మాణాలకు టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, తూమాటి బసవశంకరరావు, వక్కపట్ల శ్రీనివాసరావులు భూమి పూజ చేశారు. చల్లా సీతారామయ్య, జడ్డు జగ్గయ్య, డొక్కా నిరంజనరావు, దానయ్య, తలారి నాగార్జునరావు, కంచర్లపల్లి సుబ్బారెడ్డి, కూనపరెడ్డి యానాదిరావు, రజని, నాగపోతరావు, వడుగు నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను మండలంలో..

కృత్తివెన్ను : మండల పరిధిలోని ఇంతేరులో రూ.17 లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు, చినపాండ్రాకలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పాశం నాగమల్లేశ్వరరావు, కూనసాని చిన్న, యాదంరెడ్డి కొండ, దాసరి ఆదినారాయణ పాల్గొన్నారు.

వేములపల్లిలో మినీ గోకులానికి చౌదరిబాబు శంకుస్థాపన



ఘంటసాల : వేములపల్లి గ్రామంలో సీసీ రహదారి, మినీ గోకులం నిర్మాణానికి మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. రూ. 8 లక్షలతో సీసీ రహదారి, రూ.2.30 లక్షలతో మినీ గోకులం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఉపసర్పంచ్ రాంబాబు, గ్రామప్రముఖులు సూర్యదేవర రామకృష్ణ, తాడిబండ్ల లక్ష్మీనరేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

డిప్యూటీ సిటీ ప్లానర్‌గా గోపీనాథ్



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా కె.గోపీనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న మల్లిఖార్జునుడు గుంటూరు బదిలీ అయిన సంగతి తెలిసిందే. నగర కార్పొరేషన్ అయినప్పటికీ ఇంకా డిప్యూటీ సిటీ ప్లానర్ పోస్టు మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో గోపీనాథ్‌ను మచిలీపట్నం కార్పొరేషన్‌కు బదిలీ చేయడం చర్చనీయాంశమైంది.

చావిడి దగ్ధం, మూడు గేదెలకు గాయాలు

ఘంటసాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దగూడెంలో కొడాలి భాస్కరరావుకు చెందిన గేదెల చావిడి ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. మూడు గేదెలకు తీవ్ర గాయాలు కాగా, పక్కనే ఉన్న ఐదు ఎకరాల వరి గడ్డివామి దగ్ధమైంది. మొవ్వ అగ్నిమాపక శాఖ సిబ్బంది ఇన్‌చార్జ్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంటలను అదుపులోకి తెచ్చారు. గాయాలపాలైన పశువులకు ఘంటసాల పశువైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. సుమారు రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

కలంకారీ డిజైన్లపై అవగాహన

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌సిఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం పోలవరం గ్రామంలో కలంకారీ నూతన డిజైన్లపై మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. అరటిపళ్ళు, కరక్కాయ పువ్వు, సున్నం, బ్లు కేక్, పటికలతో నేచురల్ కలర్స్, ఆర్టిసన్స్ ఏవిధంగా తయారు చేయాలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సునీత, స్నేహిత కలంకారీ ప్రొప్రయిటర్, మాజీ సర్పంచ్ కారుపర్తి శ్రీనివాసరావు, కలర్స్ ట్రైనర్ కె. వెంకటేశ్వరరావు, కలంకారీ ఆర్టిసన్స్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

రీ సర్వే సమస్యల పరిష్కారానికి గ్రామసభ

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే ప్రాజెక్టుపై సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం మండలంలో గ్రామసభలు నిర్వహించారు. గండ్రం గ్రామంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి గ్రామసభలో పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామసభల్లో 15 అర్జీలు రాగా వాటిని పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

అవనిగడ్డలో హిందూ ఆత్మీయ సమ్మేళనం

అవనిగడ్డ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గీతా మందిరంలో శుక్రవారం హిందూ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథులుగా వీహెచ్‌పీ న్యూ ఢిల్లీ కేంద్రీయ సమరసతా కార్యదర్శి దేవ్‌భాయ్ రావత్, తూర్పు విభాగం ప్రాంత ఉపాధ్యక్షుడుపల్నాటి వెంకట స్వామి నాయుడు, వీహెచ్‌పి జిల్లా అధ్యక్షులు బూరగడ్డ శ్రీనాథ్, హిందూ ప్రముఖ్ మొవ్వ రఘుశేఖర్ ప్రసాద్ విచ్చేసి ప్రసంగించారు. లింగం బసవ శంకరరావు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, లంకే యుగంధర్, కోలా శ్రీమన్నారాయణ, మండలి వెంకటేశ్వరరావు, మానేపల్లి విజయ్ కుమార్, కొట్టె విజయ్, భోగాది రమణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అసిస్ట్ నిత్యావసరాల పంపిణీ

నాగాయలంక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీవులలోని ఏసుపురం, కృష్ణాపురం, బ్రహ్మయ్యగారి మూల, ఎదురుమొండి గ్రామాలలోని మత్స్యకార వరద బాధితులకు శుక్రవారం అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఏ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కుటుంబానికి బియ్యం ఐదు కేజీలు, నూనె, కందిపప్పు, ఒక కేజీ చొప్పున అందజేశారు. అసిస్ట్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ఎదురుమొండి గ్రామ సర్పంచ్ కన్నా సుధాకీర్తన తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు లక్ష్య విద్యార్థులు

కోడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కోడూరు లక్ష్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పి.అయ్యప్ప, పి.దానియేలు ఎంపికైనట్లు కరస్పాండెంట్ విస్సంశెట్టి నాగరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

సహచర విద్యార్థి కుటుంబానికి సాయం

అవనిగడ్డ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయినఎల్.వి.ఎల్ కళాశాల విద్యార్థి పచ్చా లోకేష్‌కు విద్యార్థులు బాసటగా నిలిచారు. లోకేష్ కుటుంబానికి నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, బాబురాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దు : మండలి

అవనిగడ్డ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అసౌకర్యం కలిగే ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పలు చోట్ల నివాసగృహాల వద్ద మద్యం షాపులు ఏర్పాటు చేయటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ మేరకు ఆదేశాలిచ్చారు. పాఠశాలలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలకు దూరంగా మద్యం షాపులను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

రిటైర్డ్ జడ్జి లక్ష్మణరావు మృతికి బుద్ధప్రసాద్ సంతాపం

అవనిగడ్డ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ న్యాయమూర్తి అంబటి లక్ష్మణరావు మృతికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. మద్య నిషేధ పోరాటాలు, సామాజిక సమస్యలపై జరిగిన ఉద్యమాలకు అంబటి లక్ష్మణరావు వెన్నుదన్నుగా నిలిచారని, అలాంటి వ్యక్తి మృతి న్యాయవ్యవస్థకు తీరని లోటని బుద్ధప్రసాద్ అన్నారు.

పట్టభద్రులు.. ఓటు నమోదు చేసుకోండి!

చల్లపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ పేర్కొన్నారు. చల్లపల్లిలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకు ఫారం-18ను అందజేశారు. నవంబర్ 6తో నమోదు గడువు ముగియనుండటంతో త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీ షెరీ, తెలుగుయువత సభ్యులు ఆరేపల్లి అశోక్, మేడికొండ రవిబాబు, పావులూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 147 మంది హాజరు

పెడన రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాసవీ ఇంజనీరింగ్‌లో శుక్రవారం టెట్‌కు 147 మంది హాజరయ్యారని అశోక్‌కుమార్ తెలిపారు.

